'అక్షరమే అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా' లక్ష్యమిదే

జీవకోన సభలో ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య



'అక్షరమే అండగా..' సభలో మాట్లాడుతున్న ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య. వేదికపై ఎమ్మెల్యే ఆరణి, కమిషనరు మౌర్య

'ఆంధ్రజ్యోతి' వేసిన పునాదిని కొనసాగిస్తాం

ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆంధ్రజ్యోతి వేసిన పునాదిని భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. ఆంధ్రజ్యోతి చేపట్టిన అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో ప్రజలు చెప్పిన సమస్యల్లో చాలావాటిని వంద రోజుల్లో పరిష్కరించాం. మిగిలిన వాటినీ పరిష్కరిస్తాం. కుక్కల బెడద ఎక్కువగా ఉందని కూడా స్థానికులు చెప్పారు. వాటికి వ్యాక్సిన్ వేయించి కట్టడి చేసేలా ఇప్పటికే చర్యలు చేపడుతున్నాం. లెప్రసీ కాలనీకి పేరు మార్చాలని కార్పొరేటర్‌తో పాటు కాలనీవాసులు కోరారు. ఆ విషయాన్ని కౌన్సిల్ మీటింగ్‌లో ప్రతిపాదించి జ్యోతి లెప్రసీ కాలనీకి జ్యోతి కాలనీగా పేరు మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

- ఎన్.మౌర్య, కార్పొరేషన్ కమిషనర్



'ఆంధ్రజ్యోతి'కి అభినందనలు

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' వంద రోజుల కిందట జీవకోనలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన సదస్సులో ప్రజలు పలు సమస్యలను ప్రస్తావించారు. ఇప్పటికే మున్సిపాలిటీ, తుడా నిధులతో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యను పరిష్కరించాం. గంజాయి బ్యాచ్, ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశాం. శ్మశాన వాటికకు ప్రహరీ, గేట్ల ఏర్పాటుకు రూ.10 లక్షలు మంజూరు చేశాం. శాశ్వత ఇంటి పట్టాల విషయమై రెవెన్యూ, ఫారెస్టు, టీటీడీ అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపుతాం. నా విజయానికి పునాది వేసిన జీవకోన అభివృద్ధికి తప్పక కృషి చేస్తా. సమస్యలను మా దృష్టికి తీసుకొచ్చి.. పరిష్కారానికి కృషి చేసిన ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే



ఇకపై నిరంతరం ప్రజలకోసం

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటికే పత్రికాపరంగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎంతగానో కృషి చేస్తున్నాం. అదే తరహాలో మరో అడుగు ముందుకు వేసి 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి పునాది వేశాం. ప్రజల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. అందులో భాగంగా వంద రోజుల కిందట ఇదే జీవకోనలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు వివరించిన అనేక సమస్యల్లో సగానికిపైగా పరిష్కారం లభించింది. మిగిలిన వాటినీ పూర్తిగా పరిష్కరించేందుకు మా వంతు కృషి చేస్తాం' అని 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య అన్నారు. తిరుపతి నగరం జీవకోనలోని శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయంలోని ఫంక్షన్ హాలులో గురువారం జరిగిన 'అక్షరమే అండగా సభలో అధికార ప్రముఖుల ప్రసంగాలు, ప్రజల స్పందన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమూరి ఆదిత్య మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.65 లక్షలతో అనేక సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు శాంతి భద్రతల రక్షణ కోసం పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఇది మొదటి అడుగేనని, ఇదే తరహాలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని చెప్పారు. ఇందుకు సహకరించిన అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, జీవకోన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అన్నా సంధ్య, అన్నా అనిత, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్‌ఎం ఉమామహేశ్వర రావు, బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జి వి.సుధాకరబాబు, ఏడీవీటీ మేనేజరు ఈశ్వరనాయుడు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి మోహన్‌రావు, సర్క్యులేషన్ ఇన్‌చార్జి ఉమాపతి, బ్యూరో ఇన్‌చార్జి శివప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ పి.నరేంద్ర, ఏబీఎన్ స్టాఫర్ దినేష్, నగరపాలక సంస్థ ఎస్ఈ శ్యామ్ సుందర్, ఎంఈ గౌతమి, డీఈ రమణ, హెల్త్ ఆఫీసర్ యువఅన్వేష్, జనసేన నాయకులు నరసింహులు నాయుడు, రాజా రెడ్డి, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



గోవిందనగర్‌లో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

భూమిపూజ.. ప్రారంభోత్సవాలు

జీవకోనకు చేరుకున్న వేమూరి ఆదిత్యకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కమిషనర్ మౌర్య, కార్పొరేటర్లు అన్నా అనిత, అన్నా సంధ్యతో కలిసి సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతో ప్రారంభమైన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించారు. జీవకోన పరిధిలో రూ.37.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును సభా కార్యక్రమం అనంతరం ప్రారంభించారు.



ఎర్రమిట్ట ఈస్ట్ మొదటి వీధిలోని సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఆంధ్రజ్యోతి డైరెక్టర్ ఆదిత్య

ఎమ్మెల్యే మాటతో ఎస్పీ చొరవ

జీవకోనలో పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటుచేస్తామన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇచ్చిన హామీతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చొరవతో అవుట్ పోస్ట్ ఏర్పాటుచేశారు. దీని ప్రారంభోత్సవంలో అతిథులతో పాటు అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ శ్రీలత, సీఐ రామకిషోర్, ఎస్ఐలు నాగార్జున రెడ్డి, లోకేశ్‌బాబు పాల్గొన్నారు.



అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

ఏపీ ఈఏపీసెట్ కేంద్రం పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2025 తిరుపతిలోని శ్రీరామా, ఎస్వీ ఇంజినీరింగ్ కాలేజీ కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. వాటిని ఎస్వీయూ వీసీ అప్పారావు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.



పరీక్షలను పర్యవేక్షిస్తున్న వీసీ అప్పారావు

సూళ్లూరుపేట 'అమృత్' రైల్వే స్టేషన్

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ



ప్రధాని కార్యక్రమం అనంతరం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, పక్కనే ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి, కలెక్టర్ తదితరులు

సూళ్లూరుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): అటు షార్.. ఇటు శ్రీసిటీ.. మరోవైపు రాష్ట్ర సరిహద్దు. ఇంతటి కీలకమైన సూళ్లూరుపేటలో రైల్వే స్టేషన్‌ను 'అమృత్ భారత్' కింద ఆధునికీకరించారు. రూ.14.50 కోట్లతో కొత్త సొబగులతో, ప్రయాణికులకు అన్ని వసతులతో ఆధునికీకరించిన ఈ రైల్వే స్టేషన్‌ను గురువారం వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించగా.. అనంతరం కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నేరుగా ప్రారంభోత్సవం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్, రైల్వే అధికారులతో కలిసి రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ.. ఒకప్పుడు రైళ్లలో కూర్చోడానికి సీట్లు కూడా ఉండేవి కావని, రైల్వే స్టేషన్‌లో తాగునీరు వసతి కూడా ఉండేది కాదన్నారు. ఇప్పుడు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఉండాలనే ఉద్దేశంతోనే ప్రధాని మోదీ ప్రధాన కూడలి ప్రాంతాల్లో అవసరమైన చోట అమృత్ భారత్ పథకంతో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారన్నారు. ఒకప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మ్యాచింగ్ ఫండ్‌తో రైల్వేలో అభివృద్ధి పనులు జరిగేవని గుర్తుచేశారు. పలు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత తీసుకుంటోందన్నారు. ఒక తిరుపతి రైల్వేస్టేషన్‌కే రూ.300 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతున్న దూరదృష్టితో చంద్రబాబునాయుడు బీజేపీతో కలిసి ముందుకెళ్లారన్నారు. ఈ నిర్ణయంతోనే రాష్ట్రానికి నేడు రూ.వేల కోట్లు వస్తున్నాయని తెలిపారు. కాగా, కేంద్ర మంత్రి, ఎమ్మెల్యే, రైల్వే అధికారులతో కలిసి రైల్వేస్టేషను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి.. ప్రారంభోత్సవ వేదికపైకి తనను పిలవలేదని అలిగి వెళ్లిపోయారు. పట్టణ ప్రథమ పౌరుడైన తనను వేదిక పైకి ఆహ్వానించలేదని రైల్వే అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.మళ్లీ పిలిచినా, తనకు అవమానం జరిగిందంటూ వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, ఆర్డీవో కిరణ్మయి, డీఆర్‌ఎం విశ్వనాథ్ తదితరులున్నారు.

సమస్యలకు పరిష్కారం చూపండి

- బయోఫ్యూయల్ పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల డిమాండ్

పెళ్లకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమ ఏర్పాటుతో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారంపై ముందుగా తమకు స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేశారు. పెళ్లకూరు మండలం పాలచ్చూరు గ్రామ రెవెన్యూ పరిధిలో దమ్ము బయోఫ్యూయల్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు సంబంధించి గురువారం ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానికులు తమ సందేహాలను వ్యక్తం చేశారు. ఉద్యోగ అవకాశాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. పరిశ్రమ ఏర్పాటు చేస్తే నీటి ఎద్దడితో పాటు రహదారి సౌకర్యం కోల్పోతామని దువ్వూరు సతీష్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థాలు భూగర్భజలాల్లో కలవకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

భూములపై సమన్వయ లోపం : పరిశ్రమ భూములపై అధికారులకు యాజమాన్యానికి మధ్య కొంత సమన్వయం లోపించింది. తొలుత నాయుడుపేట మండలంలో భూములున్నట్లు చూపారు. తర్వాత తేరుకుని పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డికి తెలియజేశారు. ఆలస్యంగా తెలియడంతో 20 శాతం మంది గ్రామస్థులు మాత్రమే హాజరయ్యారు. మూడు గంటల ఆలస్యంగా జరిగిన సమావేశంలో కనీసం తాగునీటి వసతి కూడా కల్పించక స్థానికులు ఇబ్బందులు పడ్డారు. అంతకుముందు పరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ 22.49 ఎకరాల్లో రూ.229.82 కోట్లతో 6.0 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌తో కూడిన ధాన్య ఆధారిత డిస్టలరీని ఏర్పాటు చేయనున్నామన్నారు. దీనివల్ల ప్రత్యక్షంగా 200 మందికి, పరోక్షంగా 250 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ రాజశేఖర్, సీఐ సంగమేశ్వర రావు, ఎస్ఐ నాగరాజు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సీపీఎల్ 1 ప్రారంభం

- ఎస్వీయూ మైదానంలో ఏర్పాట్లు పూర్తి

చిత్తూరు ప్రీమియర్ లీగ్(సీపీఎల్ సీజన్ 1)ను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు సీడీసీఏ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా పోటీలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి ఎస్వీయూ మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోటీలను ఆరు కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారం చేస్తామని తెలిపారు. ఐదు జట్లు, 13మ్యాచ్‌లు, ఏడు రోజుల పాటు టోర్నీ జరుగుతుందని వివరించారు. విజేత జట్టుకు రూ.2లక్షలు, రన్నర్స్‌కు రూ.లక్ష, మూడవ స్థానం జట్టుకు రూ.50వేలు నగదు బహుమతి ఉంటుందని వెల్లడించారు. ప్రతి మ్యాచ్‌లోనూ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, ఓవరాల్ టోర్నీకి మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బౌలర్, బ్యాట్స్‌మెన్, ఫీల్డర్లకు అవార్డు ప్రదానం చేస్తామన్నారు.

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి

రెవిన్యూలో బదిలీలకు శ్రీకారం

- అన్ని క్యాడర్లలోనూ స్థానచలనం
- నోడల్ అధికారిగా చిత్తూరు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): రెవిన్యూశాఖలో బదిలీలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాస్థాయిలో జరుగనున్న ఈ బదిలీలకు కలెక్టర్ సుమిత్ కుమార్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. తిరుపతి జిల్లా కలెక్టరు సభ్యుడిగా, చిత్తూరు డీఆర్వో మోహన్‌కుమార్ కన్వీనర్‌గా బదిలీల కమిటీకి నాయకత్వం వహిస్తారు.తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐలు, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, వీఆర్వో గ్రేడ్-1, గ్రేడ్-2లకు బదిలీలుంటాయి. ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగే వాటిని కలెక్టరేట్లకు మాత్రమే బదలాయిస్తారు.బదిలీ ప్రాంతంలో కలెక్టరేట్‌కు రిపోర్టు చేసుకున్న తర్వాత అక్కడి కలెక్టర్ మండలాల్లో పోస్టింగ్ ఇస్తారు. ప్రస్తుతం తిరుపతితో పోలిస్తే చిత్తూరు జిల్లాలోనే ఎక్కువగా తహసీల్దార్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- చిత్తూరు జిల్లా స్థాయిలో చైర్మన్‌గా కలెక్టర్

చిత్తూరు జిల్లాస్థాయిలో బదిలీల కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్ సుమిత్‌కుమార్, సభ్యురాలిగా జేసీ విద్యాధరి, కన్వీనర్‌గా డీఆర్వో మోహన్ కుమార్ వ్యవహరిస్తారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలోనే తహసీల్దార్లు, వీఆర్వో గ్రేడ్-1, గ్రేడ్-2 అధికారులు, ఉద్యోగులకు పోస్టింగ్స్ ఇస్తారు.కొన్ని క్యాడర్లకు జేసీ విద్యాధరి చైర్మన్‌గా, డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, ఎంఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులకు పోస్టింగ్ ఇస్తారు.ఈనెల 28వ తేదీ లోగా ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి జూన్ 2వ తేదీ లోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాల్సివుంది.

2వ తేదీలోగా బదిలీల ప్రక్రియ పూర్తి

బదిలీలకు సంబంధించి ఉద్యోగులనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఉద్యోగి హోదా, పనిచేస్తున్న జిల్లా, ఎంతకాలం నుంచి పనిచేస్తున్నారు, ఎక్కడికి బదిలీ కోరుకుంటున్నారు,ఐదేళ్లలోపు సర్వీసు ఉన్నవారు బదిలీ కోరుకుంటే కారణాలు, క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసులను పేర్కొంటూ జాబితా తయారుచేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి జూన్‌నెల 2వ తేదీలోగా బదిలీల ప్రక్రియను పూర్తిచేస్తాం. తాజా మార్గదర్శకాలతో కలెక్టరేట్‌లో బదిలీల కసరత్తు ప్రారంభించాం.

- మోహన్‌కుమార్, చిత్తూరు డీఆర్వో

ముండ్లపూడిలో అభివృద్ధి పనులకు శ్రీకారం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుచానూరు, మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడి లో ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ముందుగా గంగమ్మను దర్శించుకున్నారు. అనంతరం రూ.10లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వోవాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. రూ.50లక్షల నిధులతో మురుగునీటి కాలువల నిర్మాణానికి భమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ముండ్లపూడిలో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. రాబోయే రోజుల్లో ఈగ్రామాన్ని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతామన్నారు. అవినీతి రహిత పాలనే టీడీపీ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర రెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, మోహన్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, వాణిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

చంద్రగిరి, మే 22(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారులు, నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయ భవనం , గోవిందధామ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనుల తీరుపై ఎమ్మెల్యే ఆరాతీశారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఉద్యోగుల హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామమూర్తి

పాకాల, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకోట రామమూర్తి కోరారు. స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో గురువారం మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా హామీలు నెరవేర్చలేదన్నారు. గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొని కొత్త ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు నిరాశ మిగిలిందన్నారు. మధ్యంతర భృతి ప్రకటించాలని, డీఏలు వెంటనే ఇవ్వాలని డిమాండు చేశారు. సమావేశంలో మండల శాఖ అధ్యక్షుడు ఎం.ప్రభు, జిల్లా కౌన్సిలర్ టి.శ్రీరాములు, నాయకులు రమణ, వెంకటస్వామి, ఎన్.రెడ్డప్ప, ఎన్.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రంగనాయకస్వామి ఉత్సవాలు



శేషవాహనంపై రంగనాయకస్వామి

తిరుచానూరు, మే 22(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపట్టులోని ప్రసన్న రంగనాయకస్వామి ఆలయంలో వేడుకగా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మూడవ రోజు గురువారం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న రంగనాయకస్వామి శేషవాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. మరో ఆరు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయని ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ పూజలు

చంద్రగిరి, మే 22(ఆంధ్రజ్యోతి): నరసింగాపురంలో మహాభారతం ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలు 18 రోజుల పాటు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ధ్వజారోహణం కార్యక్రమం జరిగింది. రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటలకు వరకు హరికథ, రాత్రి వీధినాటకం నిర్వహిస్తున్నారు. జూన్ 1న అర్జున తపస్సు, 2న సైంధవ పరాభవం, 3న కీచకవధ, 4న ఉత్తర గోగ్రహణం, 5న శ్రీకృష్ణ రాయభారం, 6న భీష్మపర్వము, 7న వీరాభిమన్యు పద్మవ్యూహం, 8న దుర్యోధనుని వధ, అగ్నిగుండం, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జూన్ 1, 4, 6, 8 తేదీల్లో దుర్యోధన వధ, అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాలుంటాయి.

పశువుల నీటితొట్టెల పరిశీలన



నీటితొట్టెను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, ఏపీవో జ్యోతిశ్రీ

తిరుపతిరూరల్,మే22(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం పాతూరుగ్రామంలో ఉపాధిహామీ పథక నిధులతో నిర్మించిన పశువులనీటి తొట్టెలను గురువారం డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ పరిశీలించారు. బ్రాహ్మణపట్టులో చేపడుతున్న పంటగుంట నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఏపీవో జ్యోతిశ్రీ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు

పవనసుతుడికి లక్ష అరటిపండ్ల నివేదన



శక్తిపీఠంలో అరటిపండ్ల నివేదన

రామచంద్రాపురం, మే 22(ఆంధ్రజ్యోతి): భవానీ జలకంఠేశ్వరాలయం ఉపాలయం, శ్రీశక్తిపీఠం, నెత్తకుప్పం వానరవనం, కుప్పంబాదూరులలో గురువారం హనుమజ్జయంతి సందర్భంగా విశేష పూజలు జరిగాయి. శక్తిపీఠంలో మలయాల ఆంజనేయస్వామికి లక్ష అరటిపండ్లు, లక్ష తమలపాకులతో నివేదన సమర్పించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతిస్వామి,. శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి స్వామివారికిమంగళహారతులు ఇచ్చారు. భవానీ జలకంఠేశ్వర ఉపాలయంలో అరుణ, చంద్రశేఖర్‌నాయుడు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఏకవీర ఫౌండేసన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామి ఆధ్వర్యంలో రాయలచెరువుకట్ట ఆంజనేయ ఆలయం నుంచి శోభాయాత్ర జరిగింది.

బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ భ్యులు

గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీకి వెళ్లి మృత్యువాత పడిన గిరిజన బాలుడి కుటుం బాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు అరవ పార్వతయ్య కోరారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ రాఘ వేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. సత్యవేడుకు చెందిన బాతుల వ్యాపారి మండలంలోని నెల్లటూరు చవట గిరిజనకాలనీకి చెందిన వెంకటేష్ (9)ను బాతులు మేపే పనిలో పెట్టుకుని వెట్టిచాకిరి చేయించారన్నారు. ఆ బాలుడు చనిపోవడంతో రహస్యంగా పూడ్చిపెట్టడంతో ఆ కుటుంబం తీవ్రవేదనలో ఉందన్నారు. ఏసుపాక పెంచలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

యూడీఎస్ నిర్మాణ పనులకు భూమిపూజ



తిరుపతి రూరల్,మే 22(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం గ్రామపంచాయతీ పరిధిలోని విజయనగర్ కాలనీలో భూగర్భకాలువ(యూడీఎస్)నిర్మాణ పనులకు గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌జనార్దన్‌యాదవ్, ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సి.కృష్ణవేణి, ఎంపీడీవో కె.రామచంద్ర, అధికారులు,స్థానిక నేతలు హాజరయ్యారు. గ్రామపంచాయతీ నిధులు రూ.38.35లక్షలతో యూడీఎస్ నిర్మాణపనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ వివరించారు. కూటమి పార్టీల నేతలు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

● ఇద్దరికి గాయాలు





శ్రీకాళహస్తి, మే 22(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీ కొట్టడంతో ఇద్దరు గాయపడిన ఘటన తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. నాయుడుపేటకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటేష్ కొందరు ప్రయాణికులతో శ్రీకాళహస్తికి బయలుదేరాడు. లింగమనాయుడుపల్లి వద్ద శ్రీకాళహస్తి వైపు వెళుతుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈఘటనలో ఆటో బోల్తాపడటంతో మంగా నెల్లూరుకు చెందిన వెంకటయ్య, నాయుడుపేటకు చెందిన కోటయ్య గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ వైదిక కత్రువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఏర్పేడులో బ్యానర్ల వివాదం

ఏర్పేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి బ్యానర్లు ఏర్పాటు చేసుకున్నారు. మొదట ఒక వర్గం బ్యానర్లు ఏర్పాటు చేసి సంబరాలకు సిద్ధమైంది. అది తెలుసుకున్న మరో వర్గం అదే బ్యానర్లపై తమ బ్యానర్లను అతికించారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తి ఇరువురు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసుకున్నారు. వారి సలహాతో వివాదం సద్దుమణిగింది. ఇదే తరహాలో వర్గపోరు కొనసాగితే ఏర్పేడు మండల కేంద్రంలో టీడీపీకి నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

హెచ్చరిక బోర్డు తీసివేయాలని దళితుల నిరసన

బుచ్చినాయుడుకండ్రిగ, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారివెట్టు పంచాయతీ ఎన్టీఆర్‌నగర్‌లోని సాగు భూముల దగ్గర రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తీసివేయాలని దళితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూలోని సర్వే నెంబరు 83లో 3.88 ఎకరాల కాలువ పోరంబోకు భూములు ఉన్నాయన్నారు. ఈ భూమిని వరదయ్యపాళెం మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నారని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సదరు వ్యక్తి సాగు చేస్తున్న భూములను రెవెన్యూ అధికారులు తొలగించారని తెలిపారు. ఈ భూమిలో గ్రామానికి కొంత మేరకు శ్మశానం కోసం కేటాయించుకుని మిగతా భూమిని దేవాలయ అభివృద్ధి కోసం సాగు చేస్తున్నామని తెలిపారు. అయితే బుధవారం రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని.. ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ భూమిని శ్మశానానికి, గ్రామ అవసరాలకు ఉపయోగించే విధంగా చేయాలని దళితులు కోరారు. దళితులకు మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

గుంతలో పడిన దూడను కాపాడిన స్థానికులు



గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలో భవన నిర్మాణం కోసం తీసిన గుంతలో గురువారం ప్రమాదవశాత్తు ఆవుదూడ పడిపోయింది. ఎలా బయటకు రావాలో తెలియక ఆపసోపాలు పడుతోంది. పర్యావరణ పరిరక్షుడైన శ్యామ్‌కుమార్‌రెడ్డి తెలుసుకుని వెంటనే స్థానికుల సాయంతో దానిని సురక్షితంగా వెలుపలకు తీశారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

కాలువ గ్రిల్‌తో వాహన చోదకుల అవస్థలు



ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే దారిలో ఇబ్బందికరంగా మారిన ఇనుపగ్రిల్

చంద్రగిరి, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళే దారిలో నిత్యం వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. టవర్ క్లాక్ సమీపంలోని ఆసుపత్రికి మార్గంలో మురుగు కాలువ ఉంది. శుభ్రం చేయడానికి పంచాయతీ అధికారులు కాలువపై ఇనుప రాడ్లతో గ్రిల్ మాదిరిగా ఏర్పాటు చేశారు. నిత్యం నిత్యం వాహనాల రాకపోకలతో ఇనుప రాడ్లు కుంగిపోయాయి. ఈఏడది మార్చి లో తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి పంచాయతీ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈమార్గం లోనే ప్రభుత్వ ఆసుపత్రి, కోదండరామాలయం, విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం, విద్యుత్ సబ్ స్టేషన్ ఉన్నాయి.. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. కాలువపై ఇనుప రాడ్లు కుంగిపోవడంతో నిత్యం ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి బోల్తా పడుతున్నాయి. దీంతో గాయాలపాలవుతున్నారు. ఆసుపత్రికి 108 వాహనంలో వస్తున్నప్పుడు కాలువ దాటే క్రమంలో అందులో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కార్లు లాంటి పెద్ద వాహనాల చక్రాలు కాలువలో దిగడంతో టైర్లు పంక్చర్ అవుతున్నాయి. చక్రాలు వంగిపోతున్నాయి. అధికారులు స్పందించి కాలువపై ఉన్న ఇనుప రాడ్లను పటిష్ఠంగా నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి వేడుకలు





శ్రీవారిమెట్టు మార్గంలో విశేషాలంకరణ- తొండవాడలో పంచముఖునికి పాలాభిషేకం

చంద్రగిరి, మే 1(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గంలో భక్తాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ భక్తి కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన చేశారు. సాయంత్రం పల్లకి ప్రాకారోత్సవం నిర్వహించారు. తొండవాడ సమీపంలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయంలో ఉదయం కలశ ప్రతిష్ఠ, కదలి ఫలహోమం, అభిషేకం చేశారు. ఆలయ ఆవరణలోని 30 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పీఠాధిపతి పూజారి సూరిస్వామి, కార్యనిర్వాహకులు పూజారి శివశంకరప్రసాద్, భక్తులు పాల్గొన్నారు. చంద్రగిరి కోట, అభయవీరాంజనేయ స్వామి ఆలయాల్లో పంచామృతాభిషేకం, సింధూర సహస్రనామార్చన, మహానైవేద్యం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ఊంజల్‌సేవ చేశారు. జమండ్లవీధిఅభయ ఆంజనేయస్వామి ఆలయంలో పాలాభిషేకం



పాతకాల్వ గ్రామంలో పూజ చేస్తున్న అరుణ్ మాకిరెడ్డి తదితరులు

చేశారు. **పాకాల**:. పాకాల భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచామృత పూర్వక విశేష అభిషేకాలు, తమలపాకులతో సహస్ర నామార్చన, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. శంఖంపల్లె సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం, కుక్కల సమీపంలోని ఆంజినేయస్వామి, దామలచెరువు శ్రీతారామంజనేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. **తిరుపతి రూరల్**: పాతకాల్వలోనిఅభయ ఆంజనేయస్వామి ఆలయంలో సనాతనధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలతో అలంకారం చేసి, పంచామృత అభిషేకం నిర్వహించి దర్శన ఏర్పాట్లు చేశారు. ట్రస్ట్ అధ్యక్షులు అరుణ్‌మాకిరెడ్డి, తురుణ్, రాజేష్, బాల, హరి, గ్రామస్తులు పాల్గొన్నారు. కుంట్రపాకలోని వీరాంజనేయస్వామి ప్రత్యేకాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్త మల్లిరెడ్డిగారి భాస్కర్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పాకాలలో విశేషాలంకరణలో అభయాంజనేయస్వామి

తిరుపతి రూరల్ మండలంలో చెవిరెడ్డికి షాక్

● టీడీపీలో ముగ్గురు వైసీపీ సర్పంచులు, వార్డు మెంబర్ల చేరిక



నాని సమక్షంలో టీడీపీలో చేరిన సర్పంచులు ప్రదీప్‌రెడ్డి, పీపాసి, జ్యోతి,వార్డుసభ్యులు, కార్యకర్తలు

తిరుచానూరు, మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భారీ షాక్ తగిలింది. వైసీపీలోని ఆయన ప్రధాన అనుచరులు ముగ్గురు టీడీపీలో చేరారు. గురువారం ఎమ్మెల్యే పులివర్తి నాని సమక్షంలో రఘునాథ్ రిసార్ట్స్‌లోని టీడీపీ కార్యాలయంలో సర్పంచులు ఎం ప్రదీప్‌రెడ్డి(చిగురువాడ), పీపాసి(కేసీపేట), జ్యోతి రాజేంద్ర(పద్మావతిపురం)తో పాటు ఆయా పంచాయతీలోని పలువురు వార్డు మెంబర్లు, అనుచరులు పెద్దసంఖ్యలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో తమ పంచాయతీల్లో అభివృద్ధి జరగలేదన్నారు. చెవిరెడ్డి హయాంలో కుటుంబ పాలన, స్వార్థ రాజకీయాలతో నాశనం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లో ఎమ్మెల్యే నాని హయాంలో పార్టీలకు అతీతంగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే రాజకీయాలన్నారు. తరువాత పల్లెల అభివృద్ధే తన ధ్యేయమన్నారు. కాగా నియోజక వర్గంలో వైసీపీ నుంచి మరింతమంది చేరనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ కేడర్‌ను దృష్టిలో ఉంచుకుని పార్టీ అభివృద్ధికి పాటుపడేవారినే చేర్చుకోవాలని ఎమ్మెల్యే భావిస్తున్నారు. తాజాగా చేరినవారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీడీపీ ఈశ్వర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, అమిలినేని మధు, మధుశేఖర్, గణపతినాయుడు, కృష్ణమూర్తి రెడ్డి, శ్రీనివాసులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేడినీళ్లు పడి కూలీ మృతి

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని చింతల చేను వద్ద రైస్‌మిల్లు బ్రాయిలర్‌లోని వేడినీళ్లుపడి కూలీ మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. నెల్లూరు దొరతోపు కాలనీకి చెందిన రమేష్(32) ఉపాధి కోసం తిరుపతికి వలస వచ్చాడు. చింతల చేను వద్దగల ఒక రైస్‌మిల్లులో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం పని చేస్తుండగా బ్రాయిలర్‌లోని వేడి నీళ్ల శరీరంపై పడి దాదాపు 90 శాతం కాలిపోయింది. చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ చెప్పారు. ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

రేణిగుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి పట్టణంలోని బాలాజీ కాలనీలో చోటు చేసుకుంది. గాజులమండ్యం పోలీస్ స్టేషన్ రైటర్ సారథి తెలిపిన వివరాల మేరకు.... స్థానిక బాలాజీ కాలనీలో నివాసముంటున్న ప్రత్యూష (19) వ్యక్తిగత కారణాల వల్ల ఉరి వేసుకుని మృతి చెందింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గురువారం యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

తిరుపతి-విశాఖ ప్రత్యేక రైళ్లను పొడిగించండి

తిరుపతి(సెంట్రల్), మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి-విశాఖపట్నం మధ్య నడుపుతున్న ప్రత్యేక రైళ్లను పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు. మొదట ఈ రైళ్లను ఈనెల 29వ తేదీ వరకు మాత్రమే నడపాలని నిర్ణయించారు. తిరుపతి నుంచి ప్రతి గురువారమూ రాకపోకలు సాగిస్తున్నాయి. సామర్థ్యం కంటే ఎక్కువ మంది ప్రయాణికులతో నడుస్తున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని మరికొంత కాలం పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్: పట్టణంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. అర్బన్ సీఐ బాబి కథనం మేరకు.. గురువారం అర్ముగంనగర్‌కు చెందిన రవికుమార్ (65) నాయుడుపేట శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఓ హోటల్ వద్ద ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. దీంతో ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు కేసునమోదు చేశారు.

చిత్తూరు చిన్నబోతోంది!

● నగరి నియోజకవర్గంలోని మూడు మండలాలు తిరుపతి జిల్లాలోకి? ● భవిష్యత్తులో మిగిలేది 22 మండలాలే

చిత్తూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజనతో విద్య, వైద్య, పారిశ్రామిక, పర్యాటక ప్రాంతాలను కోల్పోయి చిత్తూరు అనాథగా మిగిలింది. ఇప్పుడు ప్రజల అభ్యర్థనలు, పరిపాలనా సౌలభ్యం పేర్లతో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చిత్తూరు మరింత చిన్నబోయేలా ఉంది.ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రివర్గ సబ్ కమిటీని నియమించారు. అప్పుడే పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలను మదనపల్లె రెవెన్యూ సబ్ డివిజన్‌లోకి మార్చేందుకు రెవెన్యూ శాఖ ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వాలని క్యాబినెట్ తీర్మానించింది. ఇందుకు అనుగుణంగా ఆయా మండలాలను మారుస్తున్నట్లు ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వాలని గురువారం చిత్తూరు, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.దీనిపై విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. పుంగనూరులోని ఆరు మండలాలు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కలిపేస్తే ఇక చిత్తూరులో 25 మండలాలే ఉంటాయి.అలాగే జిల్లాల విభజన సమయంలో నగరి నియోజకవర్గంలోని రెండు మండలాలు తిరుపతిలో, మూడు చిత్తూరులో కలిపారు. కానీ ఎన్నికల సమయంలో చిత్తూరులో ఉన్న నగరి, నిండ్ర, విజయపురం మండలాలను కూడా తిరుపతి జిల్లాలోనే కలిపేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

త్వరలో కలిపేస్తున్నామన్న భానుప్రకాష్

దీనికి అనుగుణంగా గురువారం చిత్తూరులో జరిగిన జిల్లా స్థాయి మహానాడులో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. 'త్వరలో ఆ మూడు మండలాలను తిరుపతిలో కలిపేస్తున్నాం' అని చెప్పారు.జిల్లాల పునర్వ్యవస్థీకరణ కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే చెప్పిన మాటలు అమలయ్యే సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. నగరిలోని ఆ మూడు మండలాలు తిరుపతిలో కలిసిపోతే, ఇక చిత్తూరు జిల్లాకు 22 మండలాలే మిగులుతాయి.

తాత్కాలిక పనులతో సరిపెట్టారు


మొక్కుబడిగా ఏర్పాటు చేసిన పైపులు

తిరుపతి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని శెట్టిపల్లిలో మురుగు ప్రవాహ పైపులు మొక్కుబడిగా ఏర్పాటు చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో తవ్వారు...వదిలేశారు శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన నగర పాలక సంస్థ సంబంధిత సిబ్బంది నూతనంగా డ్రైనేజీ పైపు అమర్చి మురుగు నీరు యథావిధిగా ప్రవహించేలా ఏర్పాట్లు చేశారు. అయితే ధ్వంసమైన సిమెంట్ రోడ్డుకు మరమ్మతులు చేయకుండా మట్టితోనే కప్పేశారు. దీనిపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బరువైన వాహనాలు తిరిగితే సమస్య మళ్లీ మొదటికొస్తుందని అంటున్నారు.

గంగమ్మ ఆలయానికి రూ.1,00,116 విరాళం


విరాళాన్ని అందజేస్తున్న శ్రీనివాసతేజ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే22(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుపతికి చెందిన స్మార్ట్ చెక్ సంస్థ అధినేత మాదాల శ్రీనివాసతేజ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని ఆలయ ఈవో జయకుకుమార్‌కు గురువారం ఆయన అందజేశారు. ఆలయాభివృద్ధికి ఈ విరాళాన్ని అందించినట్లు శ్రీనివాస తేజ తెలిపారు.

ఘనంగా జీవవైవిధ్య దినోత్సవం


కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22 (ఆంధ్రజ్యోతి): పద్మావతి డిగ్రీ కాలేజీలో గురువారం అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ఎకో క్లబ్ ఛైర్మన్ జ్యోతి మాట్లాడుతూ జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమన్నారు. ఇతర జీవ జాతులైన జంతువులు, పక్షులు, చెట్లను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, భక్తులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు),మే22(ఆంధ్రజ్యోతి): నాలుగుకాళ్ల మండపం వద్దనున్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మలబార్‌లో గాజుల ఉత్సవం

తిరుపతి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): స్థానిక టౌన్‌క్లబ్ కూడలి సమీపంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ప్రత్యేక బంగారు గాజుల ఉత్సవం ఏర్పాటు చేసినట్లు షోరూం హెడ్ రిజీష్ తెలిపారు. బంగారు, వజ్రాలు, విలువైన రత్నాలతో పొదిగిన సొగసైన గాజులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ ప్రత్యేక ప్రదర్శన సోమవారం వరకు ఉంటుందని, 22 క్యారెట్ల బంగారంతో వందశాతం మార్పు విలువను పొందవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా హనుమజ్జయంతి


ఉత్సవాల్లో శ్రీరామదూత ఫౌండేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): కపిలతీర్థం, నందికూడలిలో గురువారం సాయంత్రం శ్రీరామదూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆపరేషన్ సిందూర్ విజయోగత్సవం కూడా జరుపుకున్నారు. హనుమంతుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, విశేష పూజలు, సామూహిక హారతులు సమర్పించారు. హనుమాన్ చాలీసా పఠించారు. కార్యక్రమంలో శ్రీరామదూత ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ భాస్కరరావు, సునంద, భరత్, కళ్యాణి, ప్రసాద్, జనార్దన్‌రెడ్డి, జ్యోతి, శరత్, హరి, గోపినాథ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

తుడా ఆదాయం, కీర్తిప్రతిష్టలు పెంచాం

తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 22(ఆంధ్రజ్యోతి): 'తుడా ఆదాయం, కీర్తి ప్రతిష్టలు పెంచాం.. మా పాలనపై విచారణ చేయించాలని సీఎంను మేమే కోరాం' తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తుడా చైర్మన్‌గా ఉన్న సమయంలో పల్లెల అభివృద్ధికి కృషి చేశామన్నారు. తుడా చైర్మన్‌కు టీటీడీ పాలకమండలిలో ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా అవకాశం లేకుండా 2014లో టీడీపీ ప్రభుత్వం చేస్తే పునరుద్ధరించేలా చేసిన ఘనత తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వం తుడాను రూ.25కోట్లతో అప్పగిస్తే దాన్ని రూ.410కోట్లకు పెంచామన్నారు.

తిరుపతి


సత్యనారాయణపురం సర్కిల్ ఎర్రమిట్ట ఈస్ట్ మొదటి వీధిలోని సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న వేమూరి ఆదిత్య, ఎమ్మెల్యే శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య


సభకు హాజరైన జీవకోన ప్రజలు

జీవకోన ప్రజల్లో వెల్లివిరిసిన ఆనందం

'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతల వెల్లువ

తిరుపతి(జీవకోన), మే 22 (ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా..' ఆంధ్రజ్యోతి తమ ప్రాంత సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడంతో జీవకోన ప్రజల్లో ఆనందం నెలకొంది. తాము సమస్యలను ప్రస్తావించిన వంద రోజుల్లోనే సుమారు రూ.65 లక్షలతో కొన్ని పనులు జరగ్గా, మరికొన్ని పనులకు గురువారం భూమి పూజ జరిగింది. దీంతో గురువారం జరిగిన 'అక్షరమే అండగా సభ'కు తరలివచ్చారు. ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్యను కలిసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. 'దమ్మున్న ఛానల్, పేపర్ ద్వారా జీవకోన ముఖచిత్రం మారింది' అని పలువురు మహిళలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సభలోనూ కొందరు జీవకోన స్థానికులు ప్రశంసలు కురిపించారు. మరోవైపు అభివృద్ధి పనులకు భూమిపూజ, సీసీ రోడ్డు, అవుట్ పోస్ట్ ప్రారంభం, ఆర్వో ప్లాంట్ల పరిశీలనతో దాదాపు 2 గంటల పాటు జీవకోనలో సందడి వాతావరణం నెలకొంది.

35 ఏళ్ల సమస్యలకు వంద రోజుల్లో పరిష్కారం



జీవకోనలో 35 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలకు ఆంధ్రజ్యోతి నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమం ద్వారా వంద రోజుల్లోనే పరిష్కారం లభించడం గొప్ప విషయం. జీవకోన ప్రాంతంలో సరైన రోడ్లు, నీటి సదుపాయం లేక స్థానికులు చాలా ఇబ్బంది పడేవారు. యువత గంజాయికి అలవాటుపడి ఘర్షణలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. వీరిని కట్టడి చేసేందుకు ఇక్కడ పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయడం సంతోషకరం. భవిష్యత్తులోనే ఇదే స్ఫూర్తితో సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతున్నాను.

- కుమారమ్మ, ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్

ఆంధ్రజ్యోతికి రుణపడి ఉన్నాం



ప్రజల సమస్యలను పరిష్కరించి కాలనీలను అభివృద్ధి పథంలో నడిపించాలనే ప్రత్యేక శ్రద్ధతో ఆంధ్రజ్యోతి నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమానికి తగిన ఫలితం దక్కింది. ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఈ కార్యక్రమం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు మా వంతు కృషి చేశాం. ఇప్పటికే దాదాపు రూ.65 లక్షలతో సీసీ రోడ్ల ఏర్పాటు, తాగు నీటి సదుపాయాలు, డ్రైనేజీ కాలువలు వంటి సమస్యలకు పరిష్కారం లభించింది. మిగిలిన సమస్యలను పరిష్కరించేందుకు రూ.95 లక్షల నిధులు సిద్ధంగా ఉన్నాయి.

- అన్నా అనిత, కార్పొరేటర్

ఇది అంతం కాదు ఆరంభం



ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రజ్యోతి చేపట్టిన కార్యక్రమం ఆరంభంలోనే 50 శాతం ఫలితాన్ని సాధించింది. సమస్యల పరిష్కారానికి ఇది ఆరంభం మాత్రమే. ఆంధ్రజ్యోతి పురుడుపోసిన ఈ కార్యక్రమాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తప్పక పరిష్కరిస్తాం. ఆంధ్రజ్యోతి స్ఫూర్తితో ఇదే తరహాలో స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు మా వంతు కృషి చేస్తాం.

- అన్నా సంధ్య, కార్పొరేటర్

సీసీ రోడ్లు వేయడం సంతోషంగా ఉంది



గోవిందనగర్‌లో ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని గతంలో ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చాం. ఇప్పుడు గోవింద నగర్‌లో సీసీ రోడ్లు వేయడం జరిగింది. ఎన్నో ఏళ్ల సమస్యను పరిష్కరించడం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు కారణమైన ఆంధ్రజ్యోతికి, ఎమ్మెల్యేకు, అధికారులకు నా కృతజ్ఞతలు.

- శ్రీదేవి, గోవిందనగర్

శాశ్వత ఇంటి పట్టాకు చొరవ



జీవకోనలో ఎక్కువగా దినసరి కూలి పనులు చేసుకుని జీవించే వారే ఉన్నారు. కష్టపడి సంపాదించిన దాంతో పది సెంట్లు ఇంటి జాగా కొనుక్కుంటే దానికి శాశ్వత ఇంటి పట్టా లేకపోవడం వలన అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గతంలో ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చాం. ఇప్పుడు ఆ సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు చొరవ చూపడం చెప్పుకోదగ్గ విషయం.

- సుబ్రహ్మణ్యం, క్రాంతినగర్

పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు గొప్ప విషయం



జీవకోన ప్రాంతంలో కొందరు ఆకతాయిలు గంజాయికి అలవాటు పడి స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ప్రధానంగా మహిళలకు భద్రత లేకుండా పోయింది. ఈ సమస్యను పరిష్కరించాలని వంద రోజుల కిందట ఇక్కడ నిర్వహించిన అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా కార్యక్రమంలో మహిళలు అధికారుల ముందుకు తీసుకువచ్చారు. ఇప్పుడు ఆ సమస్యను పరిష్కరించేందుకు పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయడం గొప్ప విషయం.

- శ్రీరాములు, సత్యనారాయణపురం

శ్మశాన సమస్యను పరిష్కరించడం అభినందనీయం



జీవకోనలో ఎన్నో ఏళ్లుగా హిందువులు, ముస్లింలు ఎదుర్కొంటున్న శ్మశాన సమస్యను పరిష్కరించేందుకు రూ.10 లక్షలు మంజూరు చేయడం అభినందనీయం. ఆంధ్రజ్యోతి చేపట్టిన కార్యక్రమంలో ఈ విషయాన్ని అధికారుల ముందుకు తీసుకురావడం వలనే ఇంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం లభించింది.

- రఫీ, జీవకోన


ఎమ్మెల్యే శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో కలిసి మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వేమూరి ఆదిత్య

ఐసెట్‌లో జీఎస్ఎన్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ

- 50 మందికి ఉత్తమ ర్యాంకులు

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రకటించిన ఐసెట్ ఫలితాల్లో తిరుపతి భవానీనగర్‌లోని జీఎస్ఎన్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు అకాడమీ డైరెక్టర్ జి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్ఎన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా ఐసెట్ కోచింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐసెట్ ఫలితాల్లో 500లోపు 10 ర్యాంకులు, 1000లోపు 20 ర్యాంకులు, 4వేల లోపు మరో 20 ర్యాంకులు వచ్చాయని వెల్లడించారు. 50 మందికిపైగా యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కాలేజీలలో ఎంబీఏ, ఎంసీఏల్లో ఉచిత సీట్లు సాధిస్తారని వెల్లడించారు. జూలై నుంచి ఐసెట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఉచితంగా ఇవ్వనున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

టిప్పర్ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన ఇసుక టిప్పర్

తిరుపతి (నేర విభాగం), మే 22 (ఆంధ్రజ్యోతి): ఇసుక టిప్పర్ బోల్తాపడి డ్రైవర్ గాయాలపాలైన ఘటన గురువారం అలిపిరి- కపిలతీర్థం రోడ్డులో చోటు చేసుకుంది. అలిపిరి పోలీసుల వివరాల మేరకు.. జూ పార్కు రోడ్డు నుంచి ఇసుక లోడుతో టిప్పర్ తిరుపతికి వస్తోంది. అతివేగం, అలిపిరి- కపిలతీర్థం రోడ్డులో ముందు వెళుతున్న కారు స్పీడు బ్రేకర్ వద్ద అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో దాన్ని తప్పించబోయి టిప్పర్ డ్రైవర్ పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొట్టాడు. టిప్పర్ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు. అలిపిరి పోలీసులు అక్కడికి చేరుకుని రోడ్డుపై పడిన టిప్పర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదూ అందలేదని ఎస్ఐ నాగార్జున రెడ్డి చెప్పారు.

వేద కాలం నుంచే యోగా

ఎస్వీయూ వీసీ అప్పారావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22 (ఆంధ్రజ్యోతి): వేద కాలం నుంచే యోగా ఉందని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అన్నారు. యోగాంధ్ర-2025లో భాగంగా ఎస్వీయూ సెనేట్ హాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. యోగాతో ఒత్తిడిని కూడా అధిగమించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ దామోదరం, కో-కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, యోగా నిపుణులు నీరజ, ధనుంజయ్, అమరనాథ్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుగుణమ్మకు డిప్యూటీ మేయర్ల సన్మానం


సుగుణమ్మను సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణలు

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి) : ఏపీసీబీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మను మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ సత్కరించారు. గురువారం కపిలతీర్థం సమీపంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన మినీ మహానాడులో ఆమెను కలిసి అభినందించారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు చోరీ

తిరుపతి(నేరవిభాగం), మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు చోరీకి గురైంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. రేణిగుంటకు చెందిన ముస్తాఫా యూనివర్సల్ బస్సు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. టీఎన్ 02బీయూ 1030 నెంబరు బస్సు బాడుగకు వెళ్లి డ్రైవర్ శ్రీధర్ తీసుకొచ్చి చింతలచెరువు రోడ్డులో పార్కింగ్ చేశాడు. 21న రాత్రి బస్సును పార్కింగ్ చేసి వెళ్లగా స్థల యజమాని మునిరాజ ఫోన్ చేసి బస్సును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని చెప్పాడు. చుట్టుపక్కల వెతికినా బస్సు కనిపించకపోవడంతో ఓనర్ రవీంద్ర ఫిర్యాదు మేరకు గురువారం ఈస్ట్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

జూన్‌లో వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

తిరుపతి(ఆటోనగర్), మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జూన్ చివరి వారంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీవారి సన్నిధిలో గురువారం వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 164వ వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశం తిరుపతిలో నిర్వహించడానికి తీర్మానించారు. సభ్యులు సమష్టిగా విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో గవర్నర్ రావిళ్ల మాధవ నాయుడు, రామచంద్రారెడ్డి, పి.సుధాకర్ రెడ్డి, కోనేటి రవిరాజు, శివప్రసాద్ రెడ్డి, పొన్నాల చంద్ర, ప్రతాప్, మనోహర్, వినాయగం, బలరామకృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు నారాయణ విద్యార్థిని ఎంపిక


సోహిని

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని నారాయణ పాఠశాల విద్యార్థిని సోహిని కుంచెనపల్లె సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ షాహిద్ బాషా తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6, 9 తరగతుల ప్రవేశానికిగాను ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించిన జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో సోహిని 270మార్కులు సాధించిందని తెలిపారు. ఆమెను నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు, డీన్ ఏఎస్ రావు, ఏడీఎం డాక్టర్ శ్రీనివాసులు, ఆర్ఐ వసంత్ అభినందించారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



ప్రసన్నాంజనేయ విగ్రహం వద్ద ప్రసాదాలు పంపిణీ చేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

హనుమజ్జయంతి సందర్భంగా గురువారం తిరుమలలోని బేడి ఆంజనేయస్వామి ఆలయంలో, మొదటిఘాట్‌రోడ్డులోని ఏడోమైలు ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించించారు. బేడి ఆంజనేయస్వామికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించింది. మధ్యాహ్నం ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద వేద మంత్రోచ్ఛరణలు, మేళతాళాల నడుమ ప్రత్యేక పూజలు, ఆస్థానం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. జపాలి ఆంజనేయస్వామికి టీటీడీ తరుపున ఛైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. పూజల అనంతరం అర్చకులు సింధూర వస్త్రంతో ఛైర్మన్‌ను సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




జపాలి ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న బీఆర్ నాయుడు

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.24 కోట్లు
- బుధవారం దర్శించుకున్న భక్తులు: 80,964
- తలనీలాలు సమర్పించినవారు: 32,125



సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం రాజకీయ భవిష్యత్తు త్రిశంకు స్వర్గంలోనే ఉంది. ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆయన మీద టీడీపీ సస్పెన్షన్ మాత్రం గత సెప్టెంబరు నుంచీ కొనసాగుతోంది. ఇటీవల పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సత్యవేడు పర్యటనతో అటోఇటో తేలిపోతుందని అందరూ అనుకున్నా.. అటువంటిదేమీ జరగలేదు. నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు మాత్రం దిక్కుతోచని స్థితిలోనే ఉన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సత్యవేడు టీడీపీ నాయకుడెవరు?



- అయోమయంలో ఆదిమూలం భవితవ్యం
- సస్పెన్షన్‌లోనే ఎమ్మెల్యే
- స్పష్టత ఇవ్వని నారా లోకేశ్
- దిక్కుతోచని స్థితిలో టీడీపీ శ్రేణులు

ఆది నుంచీ వివాదాలు

వ్యక్తిత్వపరంగా ఎలాంటి లౌక్యం తెలియని రాజకీయ నాయకుడిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి పేరుంది. దాపరికం లేకుండా ముక్కుసూటిగా మాట్లాడే అలవాటుకు తోడు ఆవేశపరుడన్న ముద్ర ఉంది. వీటన్నిటికీ మించి ఎవరినీ లెక్కచేయరని సత్యవేడు రాజకీయాల్లో ఆయన గురించి తెలిసిన వారు చెబుతుంటారు. వీటి కారణంగా ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో కూడా సొంత పార్టీ నేతల నుంచీ వ్యతిరేకత ఎదుర్కొన్నారు. మరోవైపు కుటుంబ సభ్యుల్లో ఒకరి దూకుడు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చి పెట్టాయి. గత ఎన్నికల్లో తొలుత వైసీపీ అధిష్ఠానం సత్యవేడు అసెంబ్లీ టికెట్ నిరాకరించినా ప్రత్యామ్నాయంగా తిరుపతి ఎంపీ టికెట్ ప్రకటించింది. తర్వాత నిర్ణయం మార్చుకుని సత్యవేడు టికెట్‌నే ఖరారు చేసింది. అయితే పార్టీ అధిష్ఠానం తీరుతో తీవ్ర మనస్తాపానికి లోనైన ఆయన ఏకంగా పార్టీపైనే తిరుగుబాటు చేశారు. తన నియోజకవర్గంలో అక్రమాలకు మంత్రి పెద్దిరెడ్డే కారణమని బహిరంగ ఆరోపణలు చేశారు. ఆయనను నేరుగా సవాల్ చేశారు. ఆపై టీడీపీలో చేరి అసెంబ్లీ టికెట్ తెచ్చుకున్నారు. దీంతో ఆయన పట్ల సత్యవేడులోనే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా సానుభూతి వ్యక్తమైంది. పెద్దిరెడ్డిని ఎదిరించిన తీరు కూడా పార్టీలకు అతీతంగా పలువురికి నచ్చింది. టీడీపీ ప్రభంజనం కలసిరావడంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు.

గెలిచిన ఆనందం అంతలోనే ఆవిరైన వైనం

సత్యవేడు ఎమ్మెల్యేగా రెండవ సారి గెలిచిన ఆనందం ఆదిమూలానికి ఎక్కువ రోజులు మిగలేదు. గతేడాది సెప్టెంబరులో ఆయన ఓ వివాదంలో చిక్కుకున్నారు. నియోజకవర్గంలో సొంత పార్టీకే చెందిన ఓ మహిళా నాయకురాలు ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ ఘటన సంచలనం సృష్టించింది. ఆయనపై క్రిమినల్ కేసు నమోదైంది. దానిపై ఆయన కేసు కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. అయితే ఫిర్యాదు చేసిన మహిళ అనూహ్యంగా హైకోర్టుకు వెళ్లి తన ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని అభ్యర్థించడంతో ఆ వివాదం అంతటితో ముగిసింది. ఈలోపు పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిన్న కారణంగా టీడీపీ అధిష్ఠానం ఆయనను పార్టీ నుంచీ సస్పెండ్ చేసింది. కేసు రాజీ పడినందున సస్పెన్షన్ ఎత్తివేస్తారని పార్టీ శ్రేణులు భావించినా సుమారు ఎనిమిది నెలలుగా అధిష్ఠానం దీనిపై దృష్టి సారించలేదు. ఈ ఎనిమిది నెలల్లో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనుల కోసం ఎన్నికల నాటి పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు, తర్వాత నియమితులైన శ్రీపతి బాబులను కలవాలో, సస్పెన్షన్‌లో ఉన్న ఎమ్మెల్యేను కలవాలో అర్థంకాని పరిస్థితిలో కేడర్ ఉన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే హేమలత కూడా నియోజకవర్గంలో కనిపిస్తున్నారు.

తొలగని అస్పష్టత

లోకేశ్ పర్యటన సమయంలో నియోజకవర్గానికి పూర్తిస్థాయి కో ఆర్డినేటర్ లేదా ఇంచార్జిని ప్రకటించడమో చేస్తారని భావించారు. నాయకుడెవరో స్పష్టతనిస్తే తమ సమస్యలు చెప్పుకోవడానికి, పనులు చేసుకోవడానికి వీలు కలుగుతుందని కార్యకర్తలు అనుకున్నారు. అయితే యువనేత ఈ అంశంపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. సమస్యలుంటే ఇద్దరు పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లాలని, లేదంటే జిల్లా ఇంచార్జి మంత్రికి,పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి చెప్పాలని సూచించి వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఇప్పట్లో ఎత్తివేసే పరిస్థితి లేదని, అదే సమయంలో ఎవరినీ ఇంచార్జిగా నియమించే పరిస్థితి కూడా లేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. పార్టీ నియమించిన పరిశీలకులకు నియోజకవర్గంపై చెప్పుకోదగ్గ పట్టు లేదు. అధికారులు, ఉద్యోగులపై పట్టు అంతకన్నా లేదు. ఇంచార్జి మంత్రి అందుబాటులో వుండరు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో? పనులకు ఎవరిని ఆశ్రయించాలో? నామినేటెడ్ పదవులకు ఎవరు సిఫారసు చేస్తారో? తెలియక పార్టీ శ్రేణులు, ఆశావహులు గందరగోళంలో పడుతున్నారు.

శ్రీవారి సేవలో నిమ్మగడ్డ రమేష్‌కుమార్



తిరుమల, మే22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపానికి చేరుకున్న రమేష్‌కుమార్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం


- రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ - 2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతోపాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకుగాను ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి. మోక్షిత్ మొత్తం 400 మార్కులకుగాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వి.నిహార్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వీరితోపాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలువేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/9399976999లలో సంప్రదించాలని సూచించారు.

తిరుపతి బాలిక గిన్నిస్ రికార్డు



కీర్తన

తిరుపతి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎల్బీనగర్‌కు చెందిన ఆరవ కీర్తన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. గత ఏడాది డిసెంబర్ 1న హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ ఆధ్వర్యంలో 18 దేశాల నుంచి 1,500మంది బాలబాలికలు గంటపాటు ఎలక్ట్రిక్ కీబోర్డ్ ప్లే చేసి గిన్నిస్ రికార్డు కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కీర్తన అంతరాయం లేకుండా ఎలక్ట్రిక్ కీబోర్డ్ ప్లే చేసి గిన్నిస్ రికార్డుకు ఎంపికైనట్లు గిన్నిస్ వరల్డ్ రికార్డు టీమ్ సభ్యుడు రిచర్డ్(యూకే) గత ఏడాది డిసెంబర్ 14న ప్రకటించారు. విజయవాడకు చెందిన హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ ఏప్రిల్ 14న కీర్తనకు సర్టిఫికెట్, సిల్వర్‌మెడల్ ప్రదానం చేశారు. ఆ బాలికను, తల్లిదండ్రులు విజయబాబు, శైలజలను పలువురు అభినందించారు.

వెట్టికి బలైన బాలుడి కేసులో ముగ్గురికి రిమాండ్



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

సత్యవేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల గిరిజన బాలుడితో వెట్టి చాకిరి చేయించుకుని, అతడి మృతికి కారణమైన ఘటనలో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సత్యవేడు సీఐ కార్యాలయంలో గురువారం ఈ వివరాలను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. గూడూరు మండలం చవటపాళెం గిరిజన కాలనీకి చెందిన చెంచయ్య భార్య అంకమ్మ తన ముగ్గురు పిల్లలు, ప్రియుడితో కలిసి రెండేళ్ల కిందట సత్యవేడుకు వలసొచ్చారు. దళవాయి అగ్రహారంలోని ముత్తు వద్ద నెలకు రూ.10 వేల జీతానికి బాతులు మేపుతున్నారు. ఏడాది కింద చెంచయ్య మృతి చెందడంతో ఆమె చవటపాళెం వెళ్లారు. కర్మక్రియల అనంతరం అంకమ్మ సత్యవేడుకు వస్తుండగా.. అదే గ్రామానికి చెందిన సతీష్‌కు ఆమె రూ.25 వేల అప్పు ఉండడంతో, అతడు అడ్డుకున్నాడు. ఈ విషయం తెలిసి బాతుల వ్యాపారి ముత్తు చవటపాళెం వెళ్లి ఆ మొత్తాన్ని చెల్లించి అంకమ్మను సత్యవేడుకు తీసుకొచ్చి పనిలో పెట్టుకున్నాడు. అంకమ్మ, ఆమె పిల్లల చేత ముత్తు కుటుంబీకులు ఎక్కువ పనులు చేయించుకునే వారు. జీతం మాత్రం పెంచేవారు కాదు. దీంతో ఆమె పది నెలల క్రితం వెళ్లిపోతామని చెప్పడంతో, తన బాకీ రూ.42 వేలు చెల్లించాలని ముత్తు పట్టుబడ్డాడు. పది రోజుల్లో బాకీ చెల్లిస్తానంటే.. అప్పటి వరకు పిల్లాడిని (వెంకటేశులును) వదిలి వెళ్లాలని చెప్పాడు. దీంతో ముత్తు వద్ద ఉండిపోయిన వెంకటేశ్వర్లు బాతులు మేపే క్రమంలో ఆ బాలుడిని కంచికి తీసుకెళ్లాడు. అక్కడ ఏప్రిల్ 11న బాలుడు అనారోగ్యానికి గురికాగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ముత్తు చేర్పించాడు. చికిత్స పొందుతూ 12వ తేదీ మృతి చెందాడు. ఈ విషయాన్ని ముత్తు తన భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్‌కు చెప్పాడు. వారు కంచికి వెళ్లి బాలుడి మృతదేహాన్ని పాలారు నది ఒడ్డున పూడ్చిపెట్టేశారు. ఈ విషయాన్ని అంకమ్మకు చెప్పలేదు. నెలగా కుమారుడు ఫోన్ చేయకపోవడంతో 20 రోజుల క్రితం అంకమ్మ సత్యవేడుకు వచ్చి ముత్తును అడిగింది. కంచి పరిసర ప్రాంతాలలో బాతులు మేపేందుకు వెళ్లగా వెంకటేశ్వర్లు తప్పిపోయాడని, వెతికి తీసుకొస్తామని ఆమెను పంపించేశాడు. మళ్లీ ఈ నెల 15వ తేదీన వచ్చి బాకీ చెల్లించేస్తానని, తన బిడ్డను అప్పజెప్పాలని వేడుకుంది. ఇంకా పిల్లాడు దొరకలేదని చెప్పడంత ఆమె గట్టిగా నిలదీసింది. ముత్తు, అతడి భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్ కలిసి అంకమ్మను కులం పేరుతో దూషించి బయటకు గెంటేశారు. దీనిపై ఈనెల 19వ తేదీన ఆమె సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సత్యవేడుకు చేరుకుని విచారణ చేపట్టి, ముత్తుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ మురళి, వరదయ్యపాళెం, పిచ్చాటూరు ఎస్‌ఐలు మల్లికార్జున, వెంకటరమణ, సిబ్బంది మంగళవారం కంచికి వెళ్లి.. తమిళనాడు పోలీసుల సాయంతో బాలుడి మృతదేహం కోసం గాలించారు. బుధవారం సాయంత్రం గుర్తించి మృతదేహాన్ని వెలికి తీశారు. కంచి తాలూకా మెజిస్ట్రేట్ రఫీక్ ఆధ్వర్యంలో బాలుడి తల్లి అంకమ్మ సమక్షంలో శవానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు మెడికల్ కాలేజీకి తరలించినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు.


కష్టంగా ఉందమ్మా.. నన్ను తీసుకెళ్లమ్మా

బాతులు మేపే క్రమంలో బాలుడు వెంకటేశులును యజమాని ముత్తు చాలా హింసించేవాడని తెలిసింది. ముత్తు దగ్గర ఉన్న వెయ్యి బాతులను ఆ పసిపిల్లాడు ఒక్కడే మేపేవాడని, అతడితో విపరీతమైన పని చేయించుకునేవాడని తెలిసింది. ఈ క్రమంలో బాలుడిని ఎక్కడికి పోనివ్వకుండా పారిపోతే చంపేస్తా, కేసు పెట్టి జైలులో వేస్తానంటూ బెదిరిస్తూ కర్కశంగా వ్యవహరించే వాడని తెలిసింది. వెంకటేశులు తల్లికి ఫోన్ చేసినప్పుడల్లా ఇదే విషయం తల్లితో చెప్పి ఏడ్చేవాడని పోలీసుల విచారణలో కనుగొన్నారు. డబ్బులు కుదరలేదని, డబ్బులు వచ్చిన వెంటనే వచ్చి విడిపించుకుని వెళతానని తల్లి అంకమ్మ బాలుడికి నచ్చచెప్పేదని తెలిసింది.

టీడీపీ శ్రేణులకు అండగా..!

- గత కార్పొరేషన్ ఎన్నికల్లో తలపడ్డ వారికే మళ్లీ అవకాశం
- తిరుపతిని ఫ్లెక్సీ, ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా మారుస్తాం
- మినీ మహానాడులో తీర్మానాలు

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి గత కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసిన 23 మంది కార్పొరేట్ అభ్యర్థులకే తిరిగి అవకాశం ఇవ్వాలని తిరుపతిలో గురువారం జరిగిన మినీ మహానాడులో తీర్మానించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, ఏపీసీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని చెప్పారు. కాస్త ఆలస్యమైనా పార్టీ కేడర్‌కు ఇబ్బందిలేకుండా చూసుకుంటామన్నారు. ప్రభుత్వ రంగసంస్థల్లోని కాంట్రాక్టు పనుల్లో పార్టీ నాయకుల్లో ప్రాధాన్యత, పార్టీ నాయకుల కుటుంబ సభ్యులకు వివిధ సంస్థల్లో అర్హతను బట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని నిర్ణయించారు. తిరుపతి నగరాన్ని బ్యానర్ ఫ్రీ, ప్లాస్టిక్‌రహిత నగరంగా ఉంచాలని రాబోయే రోజుల్లో మరిన్ని మొక్కలునాటి సుందరంగా తీర్చిదిద్దాలన్న సుగుణమ్మ ప్రతిపాదనతో తీర్మానం చేశారు. ఈనెల 27 నుంచి కడపలో జరగనున్న మహానాడుకు భారీగా తరలి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ నాయకులు మల్లవరం స్వాతి, ఎం.లక్ష్మీదేవమ్మ, వసంతమ్మ, 17వ డివిజన్ ప్రధాన కార్యదర్శి హేమావతి భర్త శివయ్య, ఎమ్మార్‌పల్లి నాగేంద్రబాబు కుమారుడు చేతన్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు బి.వి.కీర్తి, మబ్బు దేవనారాయణ రెడ్డి, రుద్రకోటి సదాశివం, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, పులుగోరు మురళీకృష్ణ రెడ్డి, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, బీజీ కృష్ణయాదవ్, పుష్పావతి, బ్యాంక్ శాంతమ్మ, కుమారమ్మ, కరాటే చంద్ర, మునిశేఖర్ రాయల్, సుబ్బు యాదవ్, రేవతి, సూర్యకుమారి, రాజారం, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

పూర్ణ-తిరుపతి ప్రత్యేక రైలుకు అదనపు బోగీలు

తిరుపతి(సెంట్రల్), మే 22(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ కారణంగా పూర్ణ-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల(07609-07610)కు జూలై ఒకటో తేదీ వరకు మూడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2ఏసీ-1, 3ఏసీ-1, స్లీపర్ క్లాస్-1 కోచ్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విత్తనం చల్లుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పచ్చిరొట్ట సాగుకు సబ్సిడీపై విత్తనాల కిట్లు

దొరవారిసత్రం, మే 22(ఆంధ్రజ్యోతి) : ఈ యేడాది జిల్లా వ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో పీఎండీఎస్ కింద చిరు ధాన్యాల విత్తనాలతో పచ్చిరొట్ట పంట సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. దొరవారిసత్రం మండలం లింగంపాడు గ్రామంలో పది రకాల చిరు ధాన్యాలు కలిపిన విత్తనాలతో పచ్చిరొట్ట సాగు చేసిన గోవర్ధన్ పొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. చిరుధాన్యాలతో కూడిన కిట్లను 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈసాగు వల్ల రసాయనిక ఎరువుల వాడకంతో పాటు పెట్టుబడులు తగ్గుతాయన్నారు. తర్వాత ఆయన చిరు ధాన్యాలను పొలంలో చల్లారు. నెర్రికాలువను బాగు చేయించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం షణ్ముగం, ఏడీఏ అనిత, ఏవో జ్యోతిర్మయి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలి

- వెంకటగిరి మినీ మహానాడులో తీర్మానం

వెంకటగిరి, మే 22 : (ఆంధ్రజ్యోతి) వెంకటగిరిలో గురువారం నిర్వహించిన మిని మహానాడులో మంత్రి నారా లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ పెసిడెంట్ హోదా కల్పించాలని, ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని ఎకగ్రీవంగా తీర్మానించారు.అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం, సోమశిల-స్వర్ణముఖి లింకు కెనాల్ పూర్తి, వెంకటగిరి- గూడూరు రోడ్డు పనులు,వెంకటగిరిలో చేనేత.. బీఆర్ అంబేడ్కర్ భవనాల నిర్మాణం, రాపూరు చెరువును రిజర్వాయరుగా మార్చడం, పోకూరుపల్లి లిఫ్టు ఇరిగేషన్ మంజూరు, వెంకటగిరిలో 30 పడకల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడం వంటి అభివృద్ధి పనులను సభ తీర్మానం చేసింది.

ట్రావెల్స్ బస్సు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మే 22 (ఆంధ్రజ్యోతి):ఏకంగా ఓ ట్రావెల్స్ బస్సునే దుండగులు దొంగిలించారు. ఈ ఘటన తిరుపతిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. బుధవారం రాత్రి టీఎన్ 02బీయూ 1030 నెంబరు బస్సును డ్రైవర్ శ్రీధర్ తీసుకొచ్చి చింతలచెరువు రోడ్డులోని ఓ పార్కింగ్ ప్లేస్‌లో ఉంచారు. బస్సును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని ఆ పార్కింగ్ యజమాని ఫోన్ చేసి డ్రైవరుకు చెప్పడంతో అతడు, మరికొందరితో కలిసి చుట్టుపక్కల వెతికారు. బస్సు కనిపించకపోవడంతో ఓనర్ రవీంద్రకు డ్రైవరు తెలియజేశారు. ఎక్కడా బస్సు కనిపించకపోవడంతో గురువారం ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కేసు నమోదు చేశారు.కాగా గురువారం మధ్యాహ్నం 2గంటలకు పుంగనూరు సమీపంలో ప్రమాదానికి గురైన ఆ బస్సును పోలీసులు గుర్తించి యజమానికి సమాచారమిచ్చారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 579 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం జరిగిన పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 579 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 31 కేంద్రాల్లో 4,436 మంది హాజరు కావాల్సి ఉండగా 3,857 మంది పరీక్షలు రాశారని వివరించారు. అలాగే ఓపెన్ స్కూల్ పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు 8 కేంద్రాల్లో జరుగుతున్నాయని, గురువారం గణిత పరీక్షకు 435 మంది విద్యార్థులకుగాను 54మంది గైర్హాజరయ్యారని తెలిపారు.ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫిజికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్ పరీక్షలకు 60 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

నాయుడుపేటలో పలు రైళ్లు నిలుపుదల చేయాలి

● కేంద్రమంత్రి పెమ్మసానికి వినతి



కేంద్రమంత్రి చంద్రశేఖర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న పేర్నాటి జోసెఫ్

నాయుడుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట రైల్వే స్టేషన్‌లో గతంలో నిలిపేసిన చెన్నై ఎక్స్‌ప్రెస్, డెహ్రాడూన్ తదితర ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని నాయుడుపేట సదరన్ రైల్వే వెల్‌ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి డీఆర్‌యుసీసీ సభ్యులు పేర్నాటి జోసెఫ్ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు గురువారం వినతిపత్రం అంద జేశారు. సూళ్లూరుపేటలో అమృతభారత్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్రమంత్రి చంద్రశేఖర్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సదరన్ రైల్వే వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తానయ్య, సహకార్యదర్శి ఆర్ రాఘవన్, రవి, కంకిపాటి కిరణ్‌కుమార్, దేవిశెట్టి సునీల్, ప్రభాకర్, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



వాకాడు, మే 22 (ఆంధ్రజ్యోతి) : వాకాడు పౌరసరఫరాల గోదామును గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీనాతో కలసి తనిఖీ చేశారు. బియ్యం, పంచదార నాణ్యతను పరిశీలించారు. రికార్డులో ఉన్న స్టాక్‌కు, గోదాములో ఉన్న సరుకుల వ్యత్యాసాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోదాము ఇన్‌చార్జి వెంకటేశ్వర రావుపై వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణలు చేపట్టి అవకతవకలు జరిగి ఉంటే సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఆయన వెంట తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ సందీప్, సివిల్ సప్లయ్ డీటీ మల్లికార్జున్‌రావు తదితరులు ఉన్నారు.

బాలుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు

గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీకి వెళ్లి మృత్యువాత పడిన గిరిజన బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యుడు అరవ పార్వతయ్య కోరారు. ఈ మేరకు గురువారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. సత్యవేడుకు చెందిన బాతుల వ్యాపారి మండలంలోని నెల్లటూరు చవట గిరిజనకాలనీకి చెందిన వెంకటేష్ (9)ను బాతులు మేపే పనిలో పెట్టుకుని వెట్టిచాకిరి చేయించారన్నారు. ఆ బాలుడు చనిపోవడంతో రహస్యంగా పూడ్చిపెట్టడంతో ఆ కుటుంబం తీవ్రవేదనలో ఉందన్నారు. ఏసుపాక పెంచలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు రేపు కౌన్సెలింగ్

కోట, మే 22 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడులోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 24వ తేదీ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ శేషవర్ధన్ గురువారం పేర్కొన్నారు. ఫోన్ ద్వారా సమాచారం పంపిన గిరిజన, ఓసీ, బీసీ, ఎస్సీ విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలియజేశారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో చేరేందుకు మాత్రమే ఈ కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9441033367 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

యాదవ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు

గూడూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదోవ తరగతిలో 470కి పైగా మార్కులు సాధించిన యాదవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ గురువారం తెలిపారు. నెల్లూరు జిల్లా యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీన నెల్లూరులోని యాదవ భవన్‌లో ఈ పురస్కారాలను అందజేస్తామని వివరించారు. వివరాలకు 9948606664 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

పుత్తూరు వార్తలు

ఘనంగా హనుమజ్జయంతి



అలంకరణలో ఆంజనేయ స్వామి ఆలయం, భక్తులకు అన్నదానం

పుత్తూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా విశేషంగా పూజలు, అన్నదానం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలు, మామిడాకుల పందిళ్లతో అలంకరించి, ఉదయం నుంచే స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలు, తమలపాకులతో దండలను వేసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.



స్వామివారికి పూజలు చేస్తున్న నాయకులు

పుత్తూరు టౌన్ (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తడుకులో ప్రసన్న ఆంజనేయ ఆలయంలో ఉదయం స్వామివారికి క్షీర, గంధ, నారికేళ జలాలతో అభిషేకం చేశారు. సిందూరం, పుష్పాలతో స్వామివారిని అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తడుకు సర్పంచ్ బొబ్బిలి యాదవ్, టీడీపీ నాయకులు కరుణా, రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కృష్ణ స్వీట్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

విధేయతకు పట్టం..!

● టీడీపీ పుత్తూరు పట్టణ అధ్యక్షుడిగా జీవరత్నం నాయుడు



జీవరత్నం నాయుడు, ఎస్.ఎన్.ధనపాల్

పుత్తూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ టీడీపీలో విధేయతకు పట్టం కట్టారు. పట్టణ అధ్యక్షుడిగా గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎన్.ధనపాల్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల పరిశీలకులు, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు ప్రకటించారు. గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు స్థానిక పున్నమి కూడలిలోని కార్తీక ఫంక్షన్ హాల్‌లో పట్టణ టీడీపీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా పాత కార్యవర్గానికే మద్దతు తెలిపారు. వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి పార్టీ పట్టణ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఆయన మద్దతుదారులు కూడా అందుకు పట్టుబట్టారు. చివరకు మెజారిటీ నాయకులు, పార్టీ శ్రేణులు గాలి జీవరత్నం నాయుడిని కొనసాగించాలని కోరడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, కౌన్సిలర్లు కేశవాచారి, బసంతి, రాధా అశోక్, ఏలుమలై, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు బి.ఆర్.యుగంధర్, కరుణాకరన్, మాజీ ఛైర్మన్లు ఆనంద, ప్రతాప్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

హనుమంతుడికి విశేష అభిషేకాలు



అభిషేకం చేస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అగ్రహారపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో స్వర్ణముఖినది నుంచి కలశాలను తీసుకువచ్చిన జలాలతో మంత్రోచ్ఛరణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి



తహసీల్దార్‌జయజయరావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఓలు

కోట, మే 22 (ఆంధ్రజ్యోతి) : వీఆర్‌ఓలకు సంబంధించిన క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొన సాగించాలని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఓలు నిరసన కార్యక్రమం చేపట్టారు. వీఆర్‌ఓల అసోసియేషన్ మండల అధ్యక్షులు వాకాటి శ్రీనివాసులు, డివిజన్ కార్యవర్గ సభ్యులు కన్న రమణయ్యల ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు నల్ల బ్యాడ్జీలు ధరించి పాత విధానాన్ని కొనసాగించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తమ తహసీల్దార్ జయజయరావుకు వినతిప్రతం అందజేశారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

కోట: కోట పంచాయతీలో గురువారం పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ జరిగింది. పంచాయతీ కార్యదర్శి నెలవల రాజశేఖర్ ఆధ్వర్యంలో బజారు సెంటర్, క్రాస్‌రోడ్డుతో పాటు పలు వార్డుల్లో పారిశుధ్య కార్మికులు చెత్త వలన కలిగే నష్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు.

25న పూర్వ విద్యార్థుల కలయిక

కోట, మే 22 (ఆంధ్రజ్యోతి) : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ బీఈడీ కళాశాలలో 1986 - 87 సంవత్సరంలో బీఈడీ పూర్తిచేసిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 25న జరగనుంది. విద్యానగర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ అపూర్వ కలయిక జరుగుతుందని పూర్వ విద్యార్థులు తెలియజేశారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్

చిల్లకూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. క్రిస్‌సిటీ, సాగరమాల పనులను త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, తహసీల్దారు శ్రీనివాసులు, ఎంపీడీవో గోపి ఉన్నారు.

గొల్లలమలుగులో నేత్రదానం

తడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గొల్లలమలుగు గ్రామానికి చెందిన ఈశ్వరవాక రత్నమ్మ (84) గురువారం మృతి చెందారు. కుటుంబసభ్యులు ఆమె నేత్రాలను దానం చేయాలని నిర్ణయించారు. ఆమేరకు సూళ్లూరుపేట ఆచార్య భరద్వాజా సేవాసంస్థ ప్రతినిధులతో సంప్రదించారు. వారు చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యుల సహకారంతో మృతురాలి కంటిలోని కార్నియాలను సేకరించారు.

ఘనంగా హనుమజ్జయంతి






విఘ్నేశ్వరపురంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, కోనేటిమిట్టలోని ఆంజనేయస్వామి ఆలయంలో నాగవల్లీదళ అర్చనల్లో భక్తులు

గూడూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాలలో గురువారం హనుమజ్జయంతి పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. స్థానిక విఘ్నేశ్వరపురంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో, ఆదిశంకర కళాశాల సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పూజలు చేశారు. స్థానిక కోనేటిమిట్టలోని రామాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి అష్టోత్తర శతసహస్ర నాగవల్లీదళ సామూహికార్చనలు జరిపారు. ఆలయ ఆవరణంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. మాళవ్యానగర్‌లోని శ్రీరామరక్షా కుటీరంలో స్వామివారికి నాగవల్లీదళ సామూహికార్చనలు, విష్ణుసహస్ర నామ పారాయణం, పుష్పయాగం పూజలు జరిపారు. ఎగువవీరారెడ్డిపల్లిలోని కోదండరామాంజనేయ స్వామి ఆలయంలో ఆదిశంకరాచార్య బ్రహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో పూజలు చేశారు. పలు ఆంజనేయస్వామి ఆలయాలలో పూజలు చేసి అన్నప్రసాదాలను అందజేశారు.

బాలాంజనేయుడికి విశేష పూజలు



సూళ్లూరుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని పుష్పాలతో అలంకరించి లక్ష తమలపాకులతో అర్చన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 26 వరకు జరగనున్నాయి.

వైభవంగా శోభాయాత్ర



వెంకటగిరిటౌన్, మే 22(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల మైదానం నుంచి పట్టణ పురవీధుల్లో భారీగా ర్యాలీ, కోలాటం నిర్వహించారు. ప్రసాదాలు పంచి పెట్టారు.



కోట, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల ఆంజనేయస్వామి ఆలయాల్లో గురు వారం హనుమత్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కోటలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో స్వామివారికి పలు అభిషేకాలు చేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నుంచి బజారు సెంటర్ మీదుగా క్రాస్‌రోడ్డు వరకు హనుమాన్ శోభాయాత్ర జరిగింది. కార్యకర్తలు హనుమాన్ విగ్రహంతో బైక్ ర్యాలీ నిర్వహించారు. గూడలిలోని అభయాంజనేయస్వామి, కేశవరం, సిద్ధవరం గ్రామాల్లో ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భజనలు నిర్వహించారు.

టీడీపీ రేణిగుంట మండల, పట్టణ అధ్యక్షుల నియామకం



మునిచంద్రారెడ్డి, మెహబూబ్‌బాషా

రేణిగుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులుగా మునిచంద్రారెడ్డి, మెహబూబ్‌బాషా నియమితులయ్యారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సూచనల మేరకు టీడీపీ రేణిగుంట మండల అధ్యక్షుడిగా గాజులమండ్యంకు చెందిన మునిచంద్రారెడ్డిని, రేణిగుంట పట్టణానికి చెందిన మెహబూబ్ బాషా పట్టణ అధ్యక్షుడిగా నియమితులైనట్లు గురువారం శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయం నుండి ప్రకటన విడుదలైంది. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ పదవి దక్కినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు

రేణిగుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆంజనేయ పురం, గుత్తివారిపల్లి, కరుమారియమ్మ ఆలయంలోని ఉప ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ పురంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు.

అక్షయ క్షేత్రంలో నిత్యావసర సరుకుల పంపిణీ



రేణిగుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): అక్షయ క్షేత్రంలో టీడీపీ నాయకులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి టీడీపీ నాయకుడు సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో అక్షయ క్షేత్రంలోని మానసిక వికలాంగులకు పండ్లు, పానీయాలు పంపిణీ చేశారు. అనంతరం కేకులు కట్ చేసి మానసిక వికలాంగులకు పంచిపెట్టారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, మెహబూబ్ బాషా, నాయకులు నాదమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

రేణిగుంట, మే 22 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి పట్టణంలోని బాలాజీ కాలనీలో చోటు చేసుకుంది. గాజులమండ్యం పోలీస్ స్టేషన్ రైటర్ సారథి తెలిపిన వివరాల మేరకు.... స్థానిక బాలాజీ కాలనీలో నివాసముంటున్న ప్రత్యూష (19) వ్యక్తిగత కారణాల వల్ల ఉరి వేసుకుని మృతి చెందింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గురువారం యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్: పట్టణంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతిచెందాడు. అర్బన్ సీఐ బాబి కథనం మేరకు.. గురువారం ఆర్మగంనగర్‌కు చెందిన రవికుమార్ (65) నాయుడుపేట -శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో ఓ హోటల్ వద్ద ఉండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో ఆయన అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి కుమారుడు మేఘవర్ధ ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

మరమ్మతు పనులు నాణ్యతగా ఉండాలి : కలెక్టర్

చిట్టమూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వసతి గృహాల్లో జరుగుతున్న మరమ్మతు పనులు నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం చిట్టమూరు సాంఘిక సంక్షేమ వసతి గృహంలో జరుగుతున్న పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిట్టమూరు ఎస్సీ వసతి గృహానికి సీఎస్ఆర్ నిధులు రూ.13 లక్షలతో మరమ్మతు పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనుల్లో నాణ్యత పాటించాలని లేని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా మండలంలో నెలకొన్న పలు సమస్యలపై టీడీపీ మండల అధ్యక్షుడు కిషోర్ నాయుడు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఆయనవెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, డీటీ నిరంజన్ కుమార్ ఉన్నారు.

జనసేన కిట్ల పంపిణీ

గూడూరు అర్బన్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం జనసేన క్రియాశీలక సభ్యత్వాన్ని పొందిన సభ్యులకు ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న సభ్యులకు ప్రమాదబీమా రూ. 5లక్షలు పార్టీ అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, భాస్కర్, క్రాంతి, మనోజ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి రూ.1,00,116 విరాళం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి తిరుపతికి చెందిన స్మార్ట్ చెక్ సంస్థ అధినేత మాదాల శ్రీనివాసతేజ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని ఆలయ ఈవో జయకుకుమార్‌కు గురువారం ఆయన అందజేశారు. ఆలయాభివృద్ధికి ఈ విరాళాన్ని అందించినట్లు శ్రీనివాస తేజ తెలిపారు.

వేద కాలం నుంచే యోగా

ఎస్వీయూ వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 22 (ఆంధ్రజ్యోతి): వేద కాలం నుంచే యోగా ఉందని ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అన్నారు. యోగాంధ్ర -2025లో భాగంగా ఎస్వీయూ సెనేట్ హాల్లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. యోగాతో ఒత్తిడిని కూడా అధిగమించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంగ్రాయుడు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ దామోదరం, కో-కోఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, యోగా నిపుణులు నీరజ, ధనుంజయ్, అమరనాథ్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు చోరీ

తిరుపతి (నేరవిభాగం), మే 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు చోరీకి గురైంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. రేణిగుంటకు చెందిన ముస్తాఫా యూనివర్సల్ బస్సు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. టీఎన్ 02బీయూ 1030 నెంబరు బస్సు బాడుగకు వెళ్లి డ్రైవర్ శ్రీధర్ తీసుకొచ్చి చింతలచెరువు రోడ్డులో పార్కింగ్ చేశాడు. 21న రాత్రి బస్సును పార్కింగ్ చేసి వెళ్లగా స్థల యజమాని మునిరాజ ఫోన్ చేసి బస్సును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని చెప్పాడు. చుట్టుపక్కల వెతికినా బస్సు కనిపించకపోవడంతో ఓనర్ రవీంద్ర ఫిర్యాదు మేరకు గురువారం ఈస్ట్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా

- మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కృతజ్ఞతలు
- మినీ మహానాడులో ఎమ్మెల్యే కురుగొండ్ల
- పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన కార్యకర్తలు, జనం
- సభ విజయవంతం ● క్యాడర్‌లో నూతనోత్తేజం

వెంకటగిరి, మే 22 : (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన తనను మూడు సార్లు అత్యధిక మెజారిటీతో గెలిపించిన వెంకటగిరి ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక పింజల వీరయ్య కల్యాణ మండపంలో వెంకటగిరి నియోజకవర్గ మినీ మహానాడు జరిగింది. ముందుగా ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు వెంపటి మాధవనాయుడు, జిల్లా సహకార సంఘం అధ్యక్షులు గంగోటి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రసంగిస్తూ రాజకీయాల్లో అత్యంత దారుణమైన పాలనను గత ఐదేళ్ల వైసీపీ హయాంలో చూశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా సీఎం చంద్రబాబు ఏడాది కాలంలోనే 80శాతం రోడ్లు బాగుచేశారని తెలిపారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవనాయుడు మాట్లాడుతూ కష్టపడే మనస్తత్వం గల రామకృష్ణ ఎప్పుడూ ప్రజల కోసం పనిచేస్తూ ఉంటారన్నారు. పార్టీ పెట్టి 9నెలల్లోనే అధికారంలోకి తీసుకు వచ్చిన ఏకైక నాయకుడు ఎన్‌టీ రామారావు మాత్రమే అన్నారు. ఎన్‌టీఆర్ ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకు వచ్చి పేదలకు కూడు, గుడ్డ, గూడు నినాదంతో సంక్షేమ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. ఆయన బాటలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో ఎస్‌కెనాల్ నిర్మాణం, ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులను పూర్తి చేయాలని జిల్లా సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు గంగోటి నాగేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు జన్ని రమణయ్య, వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, ఎంపీపీ తనూజరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కెవీకే ప్రసాద్ నాయుడు, చేనేత కార్పొరేషన్ డైరక్టర్ గంగాధరం, దొంతు బాలకృష్ణ, డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షులు పునుగోటి విశ్వనాథనాయుడు, నాయకులు బీరం రాజేశ్వరావు, మంకు ఆనంద్, సీసీ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పక్కన వెంపటి మాధవనాయుడు, ధనుంజయ రెడ్డి, నాగేశ్వరరావు, మినీమహానాడుకు హాజరైన జనం

ఆగమోక్తంగా హనుమజ్జయంతి


శ్రీకాళహస్తీశ్వరాలయంలో, జెట్టిపాళెంలో ప్రత్యేకాలంకారంలో ఆంజనేయస్వామి

శ్రీకాళహస్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో హనుమజ్జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని పదహారు కాళ్ల మండపం వద్ద వెలసిన ఆంజనేయ స్వామికి అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు చేపట్టారు. స్వామివారికి చందనంతో విశేష అలంకారం చేసి ధూప దీప నైవేద్యాలు నివేదించారు. పూర్ణహారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని జై హనుమాన్ అంటూ నామస్మరణ చేశారు. ఆలయ అధికారులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు. ఇక పట్టణ శివారులోని బంగారమ్మ కాలనీలో, ఉప్పువీధిలో, జెట్టిపాళెంలో, ముత్యాలమ్మ గుడివీధిలోని నిబంజాదేవి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలులో, అక్కుర్తిలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వరదయ్యపాళెం గురువారం శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. మురళి, ముత్తురాజు, జై శ్రీరామ్ జై హనుమాన్ భక్త బృందం, సమరసత సేవా ఫౌండేషన్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వరదయ్యపాళెంలో పేదలకు అన్నదానం

● ఏర్పేడు (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మర్రిమందలో వెలసిన శ్రీలక్ష్మి హయగ్రీవ ఆలయంలో స్వామివారికి అభిషేకపూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, వెయ్యి తమలపాకులు, వెయ్యి అరటిపండ్లతో నివేదన సమర్పించారు. భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడిగా కృష్ణయాదవ్



శ్రీకాళహస్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రీకాళహస్తి రూరల్ మండల అధ్యక్షుడిగా అక్కింతల కృష్ణయాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ పటిష్ఠత కోసం ఆయన అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండల పార్టీ శ్రేణులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి మండల టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలో శ్రీకాళహస్తి మండలాన్ని పార్టీకి బలమైన కోటగా మార్చడానికి కృషి చేస్తామన్నారు. ఈ అవకాశం ఇచ్చినందుకు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ ఏర్పేడు అధ్యక్షుడిగా నాగరాజు నాయుడు

ఏర్పేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడిగా టీడీపీ సీనియర్ నేత పేరం నాగరాజు నాయుడు నూతనంగా ఎన్నికయ్యారు. ఈయన గతంలో ఉపాధ్యక్షుడిగా, యువత అధ్యక్షుడిగా, జిల్లా ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఏర్పేడు మండలంలో మంచిపట్టున్న కుటుంబం కావడంతో నాగరాజ నాయుడిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మండలాధ్యక్షుడిగా నియమించారు. నాగరాజు నాయుడికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత ఆధ్వర్యంలో గురువారం డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంద్రశేఖర్, రవికుమార్‌రెడ్డి, జ్యోతిరామ్, పేట చిరంజీవి, కావలి శివకుమార్, వెంకటరమణయాదవ్, విశ్రాంత తహసీల్దారు చంద్రశేఖర్ రావు, హరి, మునికుమార్, దినేష్, రాజా, సాయి, మునిచంద్ర, చందు, బాలాజీ, వీర మహిళలు శారద, రాజ్యలక్ష్మి, గాయత్రి, బత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం


పసుపులేటి హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న పసుపులేటి నవీన్‌కుమార్

శ్రీకాళహస్తి, మే 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను గురువారం శ్రీకాళహస్తికి చెందిన ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. తిరుపతిలోని ఆయన నివాసం వద్ద కలిసి శేషవస్త్రంతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇలాంటి పదవులు మరెన్నో అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పసుపులేటి నవీన్‌కుమార్, సాగి సతీష్, మహేష్‌యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సైనిక పాఠశాలకు చెల్లూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ఎంపిక


మోడెం హేమకృష్ణ

ఏర్పేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం చెల్లూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన మోడెం హేమకృష్ణ సైనిక పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శశిప్రకాష్ తెలిపారు. ఎంపికైన విద్యార్థి దేశం గర్వించదగ్గ సైనిక అధికారి కావాలని ఏర్పేడు ఎంఈవోలు ప్రేమలత, దయాకర్ ఆశీర్వదించారు. విద్యార్థికి, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఈ విద్యార్థిని ప్రేరణగా తీసుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు భవిష్యత్తులో మంచి ప్రభుత్వ అధికారులుగా రాణించాలని ఆకాంక్షించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు


ప్రత్యేక అలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేధో గురు దక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజ, కలశ పూజ వైదిక కతృవులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో బ్యానర్ల వివాదం

ఏర్పేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో టీడీపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి బ్యానర్లు ఏర్పాటు చేసుకున్నారు. మొదట ఒక వర్గం బ్యానర్లు ఏర్పాటు చేసి సంబరాలకు సిద్ధమైంది. అది తెలుసుకున్న మరో వర్గం అదే బ్యానర్లపై తమ బ్యానర్లను అతికించారు. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తి ఇరువురు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసుకున్నారు. వారి సలహాతో వివాదం సద్దుమణిగింది. ఇదే తరహాలో వర్గపోరు కొనసాగితే ఏర్పేడు మండల కేంద్రంలో టీడీపీకి నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

ఆటోను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

- ఇద్దరికి గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటయ్య, కోటయ్య

శ్రీకాళహస్తి, మే 22(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడిన ఘటన తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి వద్ద గురువారం చోటుచేసుకుంది. నాయుడుపేటకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటేష్ కొందరు ప్రయాణికులతో శ్రీకాళహస్తికి బయలుదేరాడు. లింగమనాయుడుపల్లి వద్ద శ్రీకాళహస్తి వైపు వెళుతుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈఘటనలో ఆటో బోల్తాపడటంతో మంగా నెల్లూరుకు చెందిన వెంకటయ్య, నాయుడుపేటకు చెందిన కోటయ్య గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యే బొజ్జలకు పలువురి శుభాకాంక్షలు


ఏర్పేడులో సంబరాలు చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

ఏర్పేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఏర్పేడు మండలంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు.ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, సీనియర్ నాయకులు శివశంకర్‌రెడ్డి, పొన్నారావు, ధనంజయులు నా యుడు, మోహన్‌రావు, సతీష్ నాయుడు, గుణయాదవ్, శివారెడ్డి, గిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.గుడిమల్లం ఆలయం వద్ద టీడీపీ నేత గిరి నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

● కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలానికి చెందిన రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఊరందూరులోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సురేష్, చెంచుప్రకాష్ యాదవ్, రాజారెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు తీసివేయాలని దళితుల నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దళితులు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారివెట్టు పంచాయతీ ఎన్టీఆర్‌నగర్‌లోని సాగు భూముల దగ్గర రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తీసివేయాలని దళితులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూలోని సర్వే నెంబరు 83లో 3.88 ఎకరాల కాలువ పోరంబోకు భూములు ఉన్నాయన్నారు. ఈ భూమిని వరదయ్యపాళెం మండలానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి సాగు చేస్తున్నారని, ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో సదరు వ్యక్తి సాగు చేస్తున్న భూములను రెవెన్యూ అధికారులు తొలగించారని తెలిపారు. ఈ భూమిలో గ్రామానికి కొంత మేరకు శ్మశానం కోసం కేటాయించుకుని మిగతా భూమిని దేవాలయ అభివృద్ధి కోసం సాగు చేస్తున్నామని తెలిపారు. అయితే బుధవారం రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని.. ఎవరూ ప్రవేశించకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఈ భూమిని శ్మశానానికి, గ్రామ అవసరాలకు ఉపయోగించే విధంగా చేయాలని దళితులు కోరారు. దళితులకు మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

టీడీపీ కోసం కష్టపడిన కార్యకర్తలకు
సముచిత స్థానం

● యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న నరసింహ యాదవ్

సత్యవేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం అందిచేందుకు పార్టీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ తెలిపారు. గురువారం స్థానిక వీఎంకే కల్యాణ మండపంలో టీడీపీ అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు, కో ఆర్డినేటర్ శ్రీపతిబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నరసింహ యాదవ్ మాట్లాడుతూ జెండా మోసిన ప్రతీ కార్యకర్తకు పార్టీ తప్పకుండా గుర్తిస్తుందన్నారు. కార్యకర్తలకు ఏదైనా సమస్యలుంటే పరిష్కరించడానికి తాను ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ జెండా రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. కో ఆర్డినేటర్ శ్రీపతిబాబు మాట్లాడుతూ ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అబ్జర్వర్ చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమం తదితర తీర్మానాలపై ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఇటీవలి కాలంలో మృతి చెందిన పార్టీ కార్యకర్తలతో పాటు, పెహల్గాంలో మృతి చెందిన భారత సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే హేమలత, మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సుందరరామిరెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, సుధాకర్ నాయుడు, శ్రీనివాస యాదవ్, తిరుమలరెడ్డి, రామాంజుల నాయుడు, సతీష్ నాయుడు, యాచేంద్ర నాయుడు, గిరి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ఆశయం

● ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ముక్కంటి జ్ఞాపికను అందజేస్తున్న వేదపండితులు, ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా పండుగలా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి స్ఫూర్తితో నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా తాను అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో ప్రజల్లో ఎంతో ఆదరణ లభించిందన్నారు. ఈ స్పందన మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేసే బాధ్యతను తనపై నిలిపిందన్నారు. కాగా ముక్కంటి ఆలయ వేదపండితులు, అధికారులు ఊరందూరులోని ఎమ్మెల్యే ఇంటికి గురువారం ఉదయం చేరుకుని వేదాశీర్వాదం, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటి వద్దకు వెళ్లి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. **కూటమి నాయకులు చెంచయ్య నాయుడు, కోలా ఆనంద్, ప్రతాప్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.** ఆ తరువాత ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సతీమణి రిషితారెడ్డి, తల్లి బృందమ్మ ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాంప్రదాయంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని బహూకరించి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే 16కాళ్ల మండపం వద్ద భక్తులకు ఉచిత లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆ తరువాత టీడీపీ కార్యాలయంలో జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. కార్యకర్తలు, నాయకులు కేక్‌లు కట్ చేయించి పంచిపెట్టారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పార్టీ కార్యాలయంలో సుమారు 10వేలమందికి భోజన ఏర్పాట్లుచేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా వాడవాడలా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొట్టంబేడు అధ్యక్షుడు మునిరాజ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. పట్టణాధ్యక్షుడు విజయకుమార్, పార్లమెంటు కోశాధికారి కంఠా రమేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మాజీ కౌన్సిలర్ మునికృష్ణ ఆధ్వర్యంలో భిక్షాల గాలిగోపురం వద్ద అన్నదానాన్ని ఎమ్మెల్యే సతీమణి రిషితారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. పట్టణంలోని పెండ్లి మండపం కూడలి వద్ద కాసరం రమేష్ ఆధ్వర్యంలో, టీడీపీ నాయకులు జావిద్ ఆధ్వర్యంలో కార్గిల్‌సెంటర్ వద్ద అన్నదానం చేశారు. మాజీ కౌన్సిలర్ దుర్గాప్రసాద్ వెంకటగిరి బస్టాండు, 23వ వార్డులో అన్నదానాలు, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని రంగయ్య పాఠశాలలో టీడీపీ నాయకులు ఉమేష్‌రావు విద్యార్థులకు పెద్దబాలశిక్ష అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సన్నిధివీధి భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద టీడీపీ నాయకులు వంకాయల సిద్ధులయ్య ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించారు. తొండమనాయుడు ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వేదపండితులు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కందాటి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అమరావతి అభివృద్ధికోసం టీడీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి రూ.10వేల నగదును అందజేశారు. ఎమ్మెల్యేను చిత్తూరు మాజీ ఎంపీ శివప్రసాద్ మనవడు వీఎం గ్రూప్ అధినేత కేతన శివప్రీతమ్ ఘనంగా సత్కరించారు. టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేష్ ఫోన్ ద్వారా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలత్తూరు రోడ్డులో అడుగడుగునా గుంతలే

● నిత్యం అధిక లోడ్లతో తిరుగుతున్న టిప్పర్లు
● పట్టించుకోని అధికారులు


కత్తివారికండ్రిగ వద్ద, పట్టాభి గిరిజన కాలనీ వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు

బుచ్చినాయుడు కండ్రిగ, మే 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలత్తూరు రోడ్డు అడుగడుగునా గుంతలమయమై అధ్వానంగా మారి ప్రయాణం దుర్భరంగా మారింది. శ్రీకాళహస్తి - తడ రోడ్డు నుంచి ఆలత్తూరు మీదుగా రెడ్డిగుంట బాడవ, పీవీకండ్రిగ మీదగా 15 కిలో మీటర్ల రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రోడ్డులో ఆలత్తూరు, రెడ్డిగుంటబాడవ, భవానీశంకరపురం గ్రామాల్లో క్వారీలు, క్రషర్ల నుంచి నిత్యం పదుల సంఖ్యలో అధికలోడ్‌తో మెటల్, డస్ట్‌ను చెన్నైకి తరలిస్తుంటారు. సామర్థ్యానికి మించి టిప్పర్లు మెటల్‌ను తీసుకుపోవడంతో రోడ్డు గుంతలమయంగా మారిపోయింది. వైసీపీ ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలలో కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు గుంతలమయం కావడంతో ఆలత్తూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సును అధికారులు ఆపివేశారు. గుంతల వలన ద్విచక్రవాహనాలు ప్రమాదాలబారిన పడి అనేక మంది గాయపడిన సంఘటలు ఉన్నాయి. ప్రస్తుతం మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రోడ్డులో గుంతలు ఎక్కువ అయ్యాయని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

చిరంజీవి అభిమానులకు సత్కారం


చిరంజీవి అభిమానులను సన్మానిస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం, మే 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో సత్యవేడు నియోజకవర్గ మెగాస్టార్ చిరంజీవి యూత్ అధ్యక్షుడు తడ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం మెగాస్టార్ సీనియర్ అభిమానులను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి తెరపైన నటనకే కాకుడా నిజజీవితంలో ఆయన సేవా హృదయానికి వీరాభిమానులమన్నారు. జీవితంలో ఆయన నడుచుకున్న తీరు ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, వేలూరు చిరంజీవి, విజయకుమార్, శ్రీధర్, గౌరిశంకర్, శేఖర్, నయాంబాషా, సురేష్, పురుషోత్తం, బలరామయ్య, త్యాగరాజు, నరేష్, అలీస్‌బాయ్, సాయి, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి


వడివేలు(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, మే 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు వడివేలు ఆకస్మికంగా గురువారం మృతి చెందారు. శ్రీకాళహస్తి పట్టణం 9వ వార్డు మాజీ కౌన్సిలర్ సుప్రజ, భర్త వడివేలు సుదీర్ఘకాలం నుంచి టీడీపీలో కొనసాగారు. గురువారం ఆయన ఆకస్మికంగా మృతి చెందారు. పలువురు టీడీపీ నాయకులు, ప్రముఖులు వడివేలు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

28న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, మే 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపు ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు ఆలయంలో జరిగే హుండీ లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో సౌత్‌జోన్ ఎయిర్‌పోర్టు డీఐజీ

ఏర్పేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వర స్వామిని చెన్నైకు చెందిన సౌత్ జోన్ ఎయిర్‌పోర్టు డీఐజీ పొన్ని కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మాజీ చైర్మన్ గిరి నాయుడు, ఈవో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఆర్టీసీ ఉద్యోగులకు ఉన్న బకాయిలు, 11వ పీఆర్సీకి సంబంధించి 24నెలల ఆరియర్స్, నాలుగు డీఏలు, ఇంత వరకు అమలు కాలేదన్నారు. దశలవారీగా చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. 2వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి డిపో గౌరవాధ్యక్షులు అంజూరు శ్రీనివాసులు, నాయకులు సత్యనారాయణ, మురగమ్మ, చంద్ర, మస్తాన్, డీఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.


జన్మదినోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్య నాయుడు, కంఠా రమేష్, మాజీ కౌన్సిలర్ దుర్గా ప్రసాద్

తహసీల్దారుకు సన్మానం


తహసీల్దారు సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న సుజాత

వరదయ్యపాళెం, మే 22 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సుధీర్‌రెడ్డిని గురువారం పలువురు సన్మానించారు. గ్రామ సమగ్ర షెడ్యూల్ గిరిజన ఆర్థిక సంక్షేమ సంఘం మండల అధ్యక్షురాలు తుపాకుల సుజాత తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. గిరిజనుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. వీఆర్‌ఏలు కూడా ఆయనను సత్కరించారు. శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.